
సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన
మాజీ కౌన్సిలర్ పంచగిరి జయమ్మ



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 133 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 10 మే 2026

# బెంగాల్ సిఎంగా సువేందు అధికారి

- ఆయనతోపాటు ఐదుగురు మంత్రుల ప్రమాణం
- ప్రమాణం చేయించి గవర్నర్ ఆర్ఎన్ రవి
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
- చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సిఎంలు హాజరు





**కోల్‌కతా, మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):**పశ్చిమ బెంగాల్‌లో మొట్టమొదటిసారి కమలదళ సర్కారు కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సువేందు చేత బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, మిగతా2లో...

# ఎట్టకేలకు తమిళనాడు ఉత్కంఠకు తెర

## - తమిళనాడు కొత్త సిఎంగా విజయ్

- విజయ్‌ను నియమిస్తూ గవర్నర్ ఉత్తర్వులు
- నేడు పది గంటలకు సిఎంగా విజయ్ ప్రమాణం
- మద్దతు లేఖలు సమర్పణ..గంటన్నరకు పైగా చర్చలు
- గవర్నర్ లేఖతో బయటకు వచ్చిన టివికె అధినేత
- 13లోగా మెజార్టీ నిరూపించుకోవాలని గవర్నర్ సూచన
- ప్రభుత్వానికి బయటనుంచి మద్దతుకు చిన్న పార్టీల నిర్ణయం



2లో

# నేడు ప్రధాని మోడీ రాక

## నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు



**హైదరాబాద్,మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం భాగ్యనగర పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించ నున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ప్రధాని మోదీ ఆదివారం మధ్యాహ్నం 2:50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు మిగతా2లో...



# 11వ తేదీ నుండి విద్యా వారోత్సవాలు

## - జిల్లా కాలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్,మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుండి నిర్వహించేంచే విద్యాశాఖ వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లను మిగతా2లో...

# సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి




**హైదరాబాద్,మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించు కున్నామని చెప్పారు.ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే మిగతా2లో...

- పట్టణ జనాభాకు అనుగుణంగా వసతులు
- రోడ్ల విస్తరణతో పాటు మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సిఎం రేవంత్



# భూముల ధరల పెంపు నిర్ణయం

## - రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్

**హైదరాబాద్,మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** భూముల ధరల సవరణ నిర్ణయంతో తెలంగాణలో రిజిస్ట్రేషన్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. స్థిరాస్తుల మార్కెట్ విలువ పెంచేందుకు కసరత్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విలువలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు మిగతా2లో...

# బండి తనయుడు భగీరథ్‌పై ఫోక్సో కేసు

## - మైనార్ బాలికపై అత్యాచరం జరిపినట్లు ఫిర్యాదు



**హైదరాబాద్,మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ భారతీయ జనతా పార్టీ కీలక నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయినట్లు సమాచారం. ఒక 17 ఏళ్ల బాలికకు బలవంతంగా మద్యం తాగించి, హైదరాబాద్‌లోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వేధింపుల కారణంగా బాధితురాలు రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. చివరికి గత అర్ధరాత్రి ఆమె పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే, మొదట్లో బండి భగీరథ్‌పై కేసు నమోదు చేసేందుకు పోలీసులు వెనుకాడటంతో పోలీస్ స్టేషన్ వద్ద సుమారు ఆరు గంటల పాటు హైడ్రామా చోటుచేసుకుంది. ఆ తర్వాత బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసు అనంతరం బండి సంజయ్ కొడుకు భగీరాథ్ మిగతా2లో...

# లేగదూడను రక్షించే క్రమంలో తెగింపు

## బావిలో పడిప్రాణాలు కోల్పోయిన తండ్రీ కొడుకులు



**ములుగు,మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రమాదవశాత్తు బావిలో పడ్డ లేగదూడను రక్షించే క్రమంలో తండ్రీ కొడుకులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. తండ్రీకొడుకులైన రస్పుత్ రాజు, పవన్‌లు కర్లపల్లి గ్రామంలోని సుమారు 35 అడుగుల లోతైన బావిలో లేగదూడ పడిపోవడంతో దానిని కాపాడేందుకు ఆ బావిలోకి దిగారు. అయితే ఇద్దరూ ఒకే తాడుతో బావిలోకి దిగే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తాడు ఒక్కసారిగా తెగిపోవడంతో ఇద్దరు బావిలో పడిపోయి నీటిలో చిక్కుకున్నారు. గోవిందరావుపేట సీఐ దయాకర్, ఎస్సై తాజుద్దీనులు ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రస్పుత్ రాజు మృతదేహాన్ని బయటకు తీశారు. మిగతా2లో...

# అనిల్ అంబానీ కార్యాలయాల్లో సిబిఐ సోదాలు




**ముంబై,మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన కార్యాలయాల్లో సీబీఐ సోదాలు చేపట్టింది. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ కంపెనీలైన రిలయన్స్ టెలికాం లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ లిమిటెడ్, రిలయన్స్ హోమ్‌లిమిటెడ్‌లపై నమోదైన కేసులకు సంబంధించి ఈ సోదాలు జరిపినట్లు తెలుస్తోంది. బ్యాంక్ మోసం కేసులో ముంబయిలోని ఆయనకు సంబంధించిన 17 ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) శనివారం తెలిపింది. కంపెనీల డైరెక్టర్ల నివాసాలు మధ్యవర్తిత్వం వహించిన సంస్థల కార్యాలయా ల్లోనూ సోదాలు జరుపుతున్నట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఒకే చిరునామా నుంచి పలు మధ్యవర్తి కంపెనీలు పనిచేస్తున్నట్లు గుర్తించామని.. దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. వేల కోట్ల రూపాయల మోసాలకు పాల్పడినట్లు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌పై ఇప్పటికే ఏడు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే సీబీఐ ఇప్పటికే పలుమార్లు అనిల్ అంబానీ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది.

PCW తెలుగు దినపత్రిక

ఆదివారం 10 మే 2026

# బెంగాల్ సిఎంగా సువేందు అధికారి

(మొదటి పేజీ తరువాయి)

రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. బీజేపీ 207 స్థానాల్లో ఘన విజయం సాధించింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ 80 సీట్లకే పరిమితం అయింది. సువేందు అధికారి రెండు చోట్ల పోటీ చేశారు. నందిగ్రామ్, భవానీపూర్ నుంచి ఆయన బరిలో నిలిచారు. భవానీపూర్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావటం విశేషం. సువేందు భవానీపూర్‌లో మమతాపై 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపు సాధించారు. అవివాహితుడైన 55 ఏళ్ల సువేందు.. బెంగాల్ కు 9వ సీఎంగా ప్రమాణం చేశారు. ఈ పదవి చేపట్టిన తొలి భాజపా నేతగా అరుదైన చరిత్ర సృష్టించారు. 1970 డిసెంబరు 15న బెంగాల్ తూర్పు మేదినీపూర్ జిల్లాలో సువేందు జన్మించారు. 1998లో మమతా బెనర్జీ స్థాపించిన తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచి దీదీకి నమ్మినబంటులా మారారు. 2004లో తమలుక్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీగా గెలిచి లోక్‌సభకు వెళ్లారు. గతంలో మమతా బెనర్జీ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. మమత మేనల్లుడి కారణంగా ఆమెతో విభేదించి.. 2020లో టీఎంసీని వీడి కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి రాష్ట్రంలో భాజపాను ముందుండి నడిపించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో, తాజా ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతా బెనర్జీని రెండుసార్లు ఓడించి సంచలనం సృష్టించారు.

# ఎట్టకేలకు తమిళనాడు ఉత్కంఠకు తెర

**చెన్నై, మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడు రాజకీయాల్లో అనిశ్చితి వీడింది. సిఎంగా జోసెఫ్ విజయ్ నియమితులయ్యారు. దీంతో ఆయన నేడు ఉదయం పదిగంటలకు తమిళనాడు సిఎంగా ప్రమాణం చేయనున్నారు. నెహ్రూ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత నాలుగు రోజుల ఉత్కంఠకు తెరదించుతూ శనివారం గవర్నర్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రకటన చేశారు. అంతకుముందు విజయ్ తన అనుచరులతో కసలి గవర్నర్ను కలిసి చర్చించారు. తనకు మద్దతు ఇస్తున్న పార్టీల లేఖలను అందించారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ జోసెఫ్ విజయ్‌ను సిఎంగా నియమిస్తూ లేఖలను అందించారు. దాదాపు గంటా నలభై నిముషాలు వీరి భేటీ జరిగింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కీలక మలుపులు తిరిగిన అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు తెలపడంతో ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ లైన్ క్లియర్ చేశారు. ఈ మేరకు తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్‌ను నియమిస్తూ లోక్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. శనివారం గవర్నర్‌ను కలిసి తమకు మద్దతిచ్చిన పార్టీల లేఖలను అందజేసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ కోరారు. మెజార్టీ మార్క్ (118)కు చేరుకోవడంతో గవర్నర్ సమ్మతించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియం వేదికగా టీవీకే చీఫ్ విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మే 13వ తేదీలోగా బల నిరూపణ చేసుకోవాలని సూచించారు. దీంతో ఇక తమిళనాడులో విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం ఈనెల 10న కొలువు తీరనుంది. గవర్నర్ అపాయిమెంట్ ఇవ్వడంతో శనివారం సాయంత్ర లోక్‌భవన్‌లో ఆయనను విజయ్ కలుసుకున్నారు. టీవీకేకు మద్దతిస్తున్న కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఐయూఎంఎల్ నేతలు కూడా విజయ్ వెంట గవర్నర్‌ను కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖలను విజయ్ గవర్నర్‌కు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. ఇందుకు గవర్నర్ సమ్మతించారు. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారు. విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. తదుపరి మంత్రి వర్గ విస్తరణలో భాగస్వామ్య పార్టీలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. ఈనెల 4న వెలువడిన ఫలితాల్లో విజయ్ టీవీకే 108 సీట్లతో ఏకైక పెద్దపార్టీగా నిలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం లేకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన గవర్నర్ మూడుసార్లు విజయ్‌కు అనుమతి నిరాకరించారు. ఈనెల 10వ తేదీతో గవర్నర్ ఇచ్చిన గడువు ముగియనుండటంతో ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. రెండు చోట్ల నెగ్గిన విజయ్ ఒకచోట వదులుకోవాల్సి ఉండటంతో టీవీకే బలం 107కు చేరింది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు, వామపక్షాల నుంచి నలుగురు ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వడంతో అది 116కు చేరింది. అయితే మరో ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతుపై సస్పెన్స్ కొనసాగుతూ వచ్చింది. ఎట్టకేలకు ఇద్దరు ఎమ్మెల్యేలున్న వీసీకే బేషరుతుగా టీవీకేకు మద్దతు తెలిపింది. దీంతో పూర్తి సంఖ్యాబలం చేకూరిన విజయ్ నాలుగోసారి గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. అయితే అప్పుడు కూడా సస్పెన్స్ కొనసాగింది. కేరళ పర్యటన ఉండటంతో గవర్నర్ అందుబాటులో లేరని చెప్పిన లోక్‌భవనన్ వర్గాలు ఆ తర్వాత కొద్దిసేపటికే గవర్నర్ పర్యటన రద్దయిందంటూ అపాయింట్‌మెంట్ ఖరారు చేసింది. దీంతో నాలుగోసారి గవర్నర్‌ను కలిసిన విజయ్ పూర్తి సంఖ్యాబలాన్ని గవర్నర్ ముందుంచారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది.

# సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఫ్యూర్,క్యూర్, రేర్ అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించుకున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించా మన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ఏరియాను మాన్యూఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సంబంధించి తెలంగాణ రైజింగ్-2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపారు. నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## భూముల ధరల పెంపు నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు చొరవ చూపుతున్నారు. ఈ నెల 12 నుంచి 15 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అదనంగా పని చేయనున్నాయి. ఆయా రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పనివేళలుగా ప్రభుత్వం నిర్ణయించింది. రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌న గర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీ నగర్, శేరిలింగం పల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్వో, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో అదనపు పనివేళలు ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. అవసరమైతే మరింత సమయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

# కాళేశ్వరంను తక్కువ చేసే యత్నం

### అధికారంలో ఉండగా ప్రాణహిత కోసం చేసిందేమీ లేదు

### కెసిఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం నిర్మాణం

### బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు



**సిద్దిపేట,మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):**కటిక చీకట్లోనూ కారుదీపం లాంటిది కాళేశ్వరం అని హరీశ్‌రావు తెలిపారు. ఎంత కరవు వచ్చినా నదిలో నీళ్లు ప్రవహించే సత్తా మేడిగడ్డకు ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసి మాట్లాడితే తెలంగాణకు ద్రోహం చేసినట్లే అవుతుందని అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ నీటి సౌలభ్యతను తక్కువ చేసి మాట్లాడకండి అని హితవు పలికారు. జలహారతి అంటూ డ్రామాలు తప్ప కాంగ్రెస్‌లో నిజాయితీ లేదని విమర్శించారు. ఆనాడు ఏడున్నరేళ్లు.. ఈనాడు రెండున్నరేళ్లు కాంగ్రెస్ డ్రామాలు చేసిందని మండిపడ్డారు. మేడిగడ్డ మరమ్మతు చేసి సాగు, తాగు నీళ్లు ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. నాలుగేళ్లలో ప్రాణహితను పూర్తి చేస్తామని చెప్పి.. ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. 2024-25 బ్జడెట్‌లో ప్రాణహితకు రూ.2కోట్లు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. 2025-26 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.30కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రాణహిత చేవెళ్లకు పెట్టింది రూ.50కోట్లు అని అన్నారు. తిప్పి తిప్పి రూ.84 కోట్లే కేటాయించారని.. వీటితో ప్రాణహిత పూర్తవుతందా అని ప్రశ్నించారు. నిజంగానే కట్టే ఆలోచన ఉంటే బ్జడెట్‌లో నిధులు పెంచాలి కదా అని నిలదీశారు. ప్రాణహితకు సంబంధించి రూ.11వేల కోట్ల పనులు పూర్తయ్యాయని నిన్న రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పాడని మండిపడ్డారు. అసలు కాంగ్రెస్ హయాంలో భూసేకరణ, పనునలకు అయిన ఖర్చు రూ.3708 కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి చెబుతున్న అబద్దాలకు హద్దూ పద్దూ ఉండాలని అన్నారు. ఆనాడు జలయజ్ఞం కాదు.. ధన యజ్ఞం అన్న రేవంత్ ఇవాళ గొప్పలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఊసర వెల్లిలా రేవంత్ రెడ్డి రంగులు మారుస్తున్నాడని మండిపడ్డారు. 30 నెలలుగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లను మరమ్మతు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండుటెండల్లోనూ 6400 క్యూసెక్కుల నీరు పోతుందని అన్నారు. మేడిగడ్డ మరమ్మతు చేస్తే కేసీఆర్‌కు పేరొస్తదని తమ్మడిహట్టి అంశం తీసుకొస్తున్నారని తెలిపారు. రాష్ట్రం గురించి రేవంత్ రెడ్డి ఏ మాత్రం ఆలోచించడం లేదని విమర్శించారు.

# నేడు ప్రధాని మోడీ రాక

(మొదటి పేజీ తరువాయి)

బయలుదేరుతారు.ప్రధాని పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడంచెల భద్రతా వలయాన్ని నిర్మించారు. సుమారు 2,000 మందికి పైగా పోలీసులతో పాటు, ప్రత్యేక రక్షణ బృందాలు, స్నైపర్లు, మఫ్తీ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన, బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి.

ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటూ సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు

# బండి తనయుడు భగీరథ్‌పై ఫోక్సో కేసు

(మొదటి పేజీ తరువాయి)

మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. ఇంతకుముందు కూడా కాలేజీలో ఒక విద్యార్థిపై దాడి చేసి భగీరథ్ వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అయితే భగీరథ్‌పై పాత వివాదాల నేపథ్యంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గతంలో చేసిన ట్వీట్ ఇప్పుడు మళ్ళీ వైరల్‌గా మారింది. భగీరథ్‌ను ఇరాక్ మాజీ నియంత సద్దాం హుస్సేన్ కుమారుడు ఉదయ్ హుస్సేన్‌తో పోలుస్తూ ఆర్జీవీ అప్పట్లో చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలిచింది.

# బెంగాల్ ప్రజలకు మోడీ సాష్టాంగ ప్రణామం

**• అశేషంగా హాజరైన ప్రజలకు అభివాదం**



**కోల్‌కతా,మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):**పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ ప్రజలకు సాష్టాంగ వందనం చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. భారీ సంఖ్యలో హాజరైన ప్రజలను చూసిన ప్రధాని మోదీ ముందుగా చేతులు ఊపుతూ అభివాదం చేశారు. అనంతరం మోకాళ్లపై కూర్చుని, చేతులు జోడించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్ చరిత్రలో బీజేపీ తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. తమకు మద్దతుగా నిలిచిన ఆ రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి మోదీ ఈ విధంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు హాజరయ్యారు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమ బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీ తాజా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్న సువేందు అధికారి, ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నేతగా ఎదిగారు. బెంగాల్‌లో బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించి ఏకంగా ముఖ్యమంత్రి అయిపోయారు.

# 11వ తేదీ నుండి విద్యా వారోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. విద్యా వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో సి ఎస్ మాట్లాడుతూ ఈ నెల 11 న ఎల్ బి స్టేడియం లో నిర్వహించనున్న విద్యావారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు బారి సంఖ్యలో హాజరయ్యేలా కలెక్టర్లు చొరవతీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వారోత్సవాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను , రోజువారీ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్లకు విద్యాశాఖ ఉన్నతాధికారులు వివరించారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ కి సంబంధించిన పురోగతి, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, జనాభా స్వీయ గణన కు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి సి ఎస్ జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియె కాన్ఫరెన్స్ లో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా , కళాశాల విద్యా శాఖ కమీషనర్ దేవసేన, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ , పౌర సరఫరాల శాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# లేగదూడను రక్షించే క్రమంలో తెగింపు

(మొదటి పేజీ తరువాయి)

పవన్ మృతదేహం కోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు కొనసాగిస్తున్నారు. తండ్రీకొడుకులు గొప్ప మనసుతో ఓ మూగజీవిని రక్షించాలనుకుని ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కోమటిపల్లి రైల్వే సొరంగ మార్గం

### - నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

**వరంగల్,మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):**కాజీపేట రైల్వే సబ్ డివిజన్ పరిధిలోని మూడో లైన్, కోమటిపల్లి భూగర్భ రైల్వే సొరంగ మార్గాన్ని ప్రధాని నరేంద్రమోదీ హైదబాదాద్ నుంచి వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర దక్షిణ భారతానికి ముఖ ద్వారమైన కాజీపేట రైల్వే జంక్షన్ సమీపంలోని కోమటిపల్లి వద్ద రైలు ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు రైల్వే శాఖ భూగర్భ సొరంగం మార్గం నిర్మించారు. దీంతోపాటు సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట-బలార్షా, కాజీపేట- విజయవాడ సెక్షన్‌లో రైళ్ల రద్దీకి అనుగుణంగా 421 కిలో మీటర్ల మూడో లైన్‌ను ఏర్పాటు చేశారు. గ్రాంట్ ట్రంక్ రూట్‌లో ఢిల్లీ-సికింద్రాబాద్, విజయవాడ సెక్షన్‌లో రైళ్ల రద్దీని తగ్గించేందుకు రైల్వేశాఖ దాదాపు 12 ఏళ్ల కాలంలో దాదాపు రూ.4015 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసింది. ఈ రెండు ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని రైల్వే అధికారులు వెల్లడించారు.

# కరాటేనే జీవితం..
# శిష్యుల విజయమే లక్ష్యం

## 26 ఏళ్లుగా పరకాల యువతలో ఆత్మవిశ్వాసం నింపుతున్న కరాటే మాస్టర్ రావుల స్వామి

**(పీసీడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):**

ఉద్యమాల పురిటిగడ్డగా, పోరాటాల పుట్టినిల్లుగా పేరుగాంచిన వరంగల్ జిల్లా పరకాల పట్టణం ఎన్నో గొప్ప వ్యక్తిత్వాలకు నిలయంగా నిలిచింది. అలాంటి పరకాల నేలపై పుట్టి పెరిగి, కరాటేను కేవలం క్రీడగా కాకుండా జీవిత సాధనగా మార్చుకుని వేలాది మంది యువతకు మార్గదర్శకుడిగా నిలుస్తున్న వ్యక్తి కరాటే మాస్టర్ రావుల స్వామి. దాదాపు 26 సంవత్సరాలుగా నిరంతర కృషితో కరాటే శిక్షణ అందిస్తూ, యువతలో క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం, ఆత్మరక్షణ భావాలను పెంపొందిస్తున్న ఆయన సేవలు ప్రశంసనీయంగా నిలుస్తున్నాయి. చిన్ననాటి నుంచే శారీరక దృఢత్వం, క్రమశిక్షణపై ఆసక్తి పెంచుకున్న రావుల స్వామి యవ్వన దశలోనే కరాటే వైపు అడుగులు వేశారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన అనేక కష్టాలను ఎదుర్కొంటూనే కరాటేలో ప్రావీణ్యం సాధించారు. ప్రస్తుతం బ్లాక్ బెల్ట్ సెకండ్ డన్ స్థాయిలో కొనసాగుతూ పరకాల ప్రాంతంలో కరాటేకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా లక్ష్యాన్ని మాత్రం ఎప్పుడూ వదల్లేదు. శనివారం పీసీడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధితో మాట్లాడిన రావుల స్వామి కరాటే ప్రాముఖ్యతను వివరించారు. “కరాటే అంటే కేవలం ఫైటింగ్ కాదుడ అది మనిషిని సంపూర్ణంగా తీర్చిదిద్దే జీవన విధానం. శరీరానికి బలం, మనసుకు ధైర్యం, జీవితానికి క్రమశిక్షణ నేర్పేది కరాటే” అని ఆయన తెలిపారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా మహిళలు, బాలికలకు ఆత్మరక్షణ విద్య తప్పనిసరి అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. రావుల స్వామి శిక్షణలో ఇప్పటివరకు వందలాది మంది విద్యార్థులు తీర్చిదిద్దబడ్డారు. వారిలో అనేక మంది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించి గురువు పేరు నిలబెట్టారు. అయితే తనకు నిజమైన గెలుపు పతకాలలో కాదని, శిష్యులు మంచి వ్యక్తులుగా ఎదగడంలో ఉందని ఆయన చెబుతారు. అందుకే ఆయన శిక్షణలో కేవలం ఫైటింగ్ టెక్నిక్స్ మాత్రమే కాకుండా సమయపాలన, పెద్దలకు గౌరవం, ఆరోగ్యంపై శ్రద్ధ, మానసిక స్థైర్యం, సామాజిక బాధ్యత వంటి విలువలను కూడా బోధిస్తారు. ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే... ఇంతకాలం సేవలందిస్తున్నప్పటికీ రావుల స్వామి ఎప్పుడూ డబ్బును లక్ష్యంగా పెట్టుకోలేదు. తన వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పూర్తిగా ఉచితంగా కరాటే శిక్షణ అందిస్తున్నారు. సమాజ సేవే తన అసలు ధ్యేయమని భావిస్తూ ఎంతోమంది యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి క్రీడల వైపు మళ్లిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సేవా భావంతో ముందుకు సాగడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం. “నా శిష్యులు జీవితంలో ధైర్యంగా నిలబడాలిడ వారు ఉన్నత స్థాయికి చేరుకోవడమే నాకు నిజమైన ఆనందం” అని రావుల స్వామి భావోద్వేగంగా తెలిపారు. గురువు పట్ల ఆయన శిష్యుల్లో అపారమైన గౌరవం కనిపిస్తుంది. “మాకు కరాటే మాత్రమే కాదు.. జీవితం ఎలా



గడపాలో కూడా మా గురువు నేర్పించారు” అని శిష్యులు గర్వంగా చెబుతున్నారు. పరకాల వంటి ఉద్యమాల గడ్డపై కరాటే ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం నింపుతూ, ఆత్మరక్షణపై అవగాహన కల్పిస్తూ, నిస్వార్థ సేవతో ముందుకు సాగుతున్న కరాటే మాస్టర్ రావుల స్వామి నిజంగా అభినందనీయుడు. కరాటేను కేవలం క్రీడగా కాకుండా జీవిత మార్గంగా చూపిస్తూ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్న ఆయన పరకాల పట్టణానికి గర్వకారణమనే చెప్పాలి.

# నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన మాజీ కౌన్సిలర్ పంచగిరి జయమ్మ



**పరకాల, మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణం 17వ వార్డుకు చెందిన ముదిరాజ్ కులస్తురాలు బోళ్ల సరోజన (75) అనారోగ్యంతో మృతి చెందారు. తీవ్ర పేదరికంలో జీవిస్తున్న ఆమె కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేకపోవడంతో, పరకాల పశువుల సంతలో ఒక చెట్టు కింద మంచంపై మృతదేహాన్ని ఉంచిన విషాదకర పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ పంచగిరి జయమ్మ వెంటనే అక్కడికి చేరుకుని మానవత్వాన్ని చాటుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు, అంత్యక్రియలకు అవసరమైన దాన సంస్కరణలను స్వయంగా దగ్గరుండి నిర్వహించారు. తన సొంత ఖర్చులతో అంత్యక్రియలు చేయించి ఆదర్శంగా నిలిచారు. కష్టకాలంలో నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన పంచగిరి జయమ్మ సేవలను స్థానికులు ప్రశంసించారు. మానవత్వం ఇంకా బ్రతికే ఉందని ఆమె చర్యలు మరోసారి నిరూపించాయని ప్రజలు అభిప్రాయపడ్డారు.

# బీఎస్పీ ఆదిలాబాద్ జోన్ -1 సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయండి

- జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్





**జమ్మికుంట,మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్):** బహుజన సమాజ్ పార్టీ హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకులచే సమీక్షా సమావేశం జమ్మికుంట ప్రభు ఆర్ట్స్ గ్యాలరీ నందు శనివారం హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు మంద సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్, పార్లమెంట్ ఇంచార్జ్ దొడ్డసమ్మయాలు ముఖ్య అతిథులుగా హాజరై రానున్న ఎంపిటిసి జెడ్పిటిసి ఎన్నికలలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) గ్రామ గ్రామాన గడపగడపకు తీసుకువెళ్లే విధంగాఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు అగ్రకుల పేదలందర్నీ ఏకం చేస్తూ గెలిపి లక్ష్యంగా అసెంబ్లీ కమిటీలతో పాటు సెక్టార్ కమిటీలు, బూట్ కమిటీల నిర్మాణాలు బలోపేతం చేయాలని సూచించారు. ఈనెల 14న కరీంనగర్ లో జరిగే ఆదిలాబాద్ జోన్ – 1 పరిధిలో జరిగే సమీక్ష సమావేశాన్ని విజయ వంతం చేయాలని జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్ కోరారు. ఈ సమావేశానికి బీఎస్పీ రాష్ట్ర రథసార ఇబ్రహీం శేఖర్, నేషనల్ చీఫ్ సెక్టార్ కోఆర్డినేటర్ , మాజీ ఎమ్మెల్సీ అతార్ సింగ్ రావ్, మరో కోఆర్డినేటర్ సురేష్ ఆర్య, , రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్, అదిలాబాద్ జోన్ -1 చీఫ్ కోఆర్డినేటర్ నిషాని రామచంద్రం లు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు, జూపాక గ్రామ ఉపసర్పంచ్ గిన్నారపు మహేందర్, హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జులు డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), వేల్పుల మల్లేశం, ఎమ్మెల్యే, ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, సీనియర్ నాయకులు ఈదునూరి రమేష్, హుజురాబాద్ అసెంబ్లీ కమిటీ నాయకులు, గరిగే చంద్రయ్య, మారముల్లా సదయ్య, రాచపల్లి రమేష్,సీనియర్ నాయకులు మామిండ్ల మల్లయ్య, బీఎస్పీ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు ఉల్లెందుల సురేష్ పాల్గొన్నారు.

# జర్నలిజంపై వారి గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదు

**జర్నలిస్టు సహదేవ్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలి**

**తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు గౌడ్ డిమాండ్**

**కురవి మే09(పి.సి.డబ్ల్యూ న్యూస్) :** జర్నలిస్టు బేతమల్ల సహదేవ్‌పై వ్యక్తిగత దూషణలు చేయడాన్ని వార్తలు రాసినందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. మే 5న కురవి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో బీజేపీ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ వీరన్న ప్రత్యేక పూజల్లో పాల్గొనడం రాజకీయంగా చర్చనీయాంశమైంది . ఈ నేపథ్యంలో ప్రజల్లో వ్యక్తమైన అనుమానాలు, రాజకీయ విశ్లేషణలను ఆధారంగా చేసుకొని “ఒక పత్రిక“లో కథనం ప్రచురించడం జరిగింది. ఆ వార్తను వక్రీకరించి జర్నలిస్టు సహదేవ్ పై డబ్బులు డిమాండ్ చేశారంటు సోషల్ మీడియాలో ఆరోపణలు చేయడం అనైతికమని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వార్త రాసినందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకోవడం, వ్యక్తిగతంగా దూషించడం సరైన పద్ధతి కాదన్నారు. అధికార అహంకారంతో మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు నిజాలు తెలియజేయడం జర్నలిస్టుల బాధ్యత అని, వార్తలపై స్పందించాల్సింది పోయి వ్యక్తిగత ఆరోపణలు చేయడం అనైతికమని పేర్కొన్నారు. అధికారం ఉందని ఇష్టానుసారం ప్రవర్తించడం, మీడియాపై ఒత్తిళ్లు తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. జర్నలిస్టుల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సమాజం సహించదని ఇతర జర్నలిస్ట్ సభ్యులు హెచ్చరించారు. ఈ వ్యవహారంలో డాక్టర్ వీరన్న వెంటనే జర్నలిస్టు బేతమల్ల సహదేవ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, అలాగే జర్నలిస్టు సమాజానికి కూడా క్షమాపణలు తెలపాలని జిల్లా ప్రెస్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభమని, దాని



స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎందుకు ప్రతి జర్నలిస్ట్, ప్రెసెంట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆయనకు సపోర్ట్ గా ఉంటామని శనివారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

# క్యాన్సర్ బాధిత కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి మంత్రి సీతక్క భరోసా..

- ఆర్థిక సాయంతో మానవత్వం




**ములుగు మున్సిపాలిటీ (బండారుపల్లి)మే09 (పిసిడబ్ల్యూ న్యూస్):** కష్టకాలంలో ఉన్న పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండటంలో తాను ఎప్పుడూ ముందుంటానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క) మరోసారి చాటిచెప్పారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ములుగు మున్సిపాలిటీ బండారుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ జింజిరాల దేవయ్య గారిని శనివారం ఆమె పరామర్శించారు. నేరుగా దేవయ్య గారి నివాసానికి వెళ్లిన మంత్రి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వ్యాధి పట్ల ఏమాత్రం అధైర్యపడవద్దని, మనోధైర్యంతో ఉంటే త్వరగా కోలుకోవచ్చని భరోసా కల్పించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన దేవయ్య లాంటి సీనియర్ నేతలకు ప్రభుత్వం మరియు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, దేవయ్య గారి వైద్య ఖర్చుల నిమిత్తం మంత్రి సీతక్క తన వంతుగా ఆర్థిక సాయం అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. మంత్రి స్వయంగా ఇంటికి వచ్చి ధైర్యం చెప్పడంపై దేవయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్, ములుగు మండల పార్టీ అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా, గ్రామ కమిటీ అధ్యక్షులు నెల్లుట్ల రాజన్న, మున్సిపల్ కౌన్సిలర్లు మరియు పార్టీ యువజన నాయకులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



- ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర



**కల్లూరు, మే 09 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అనంతరం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య చొరవతో, బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు సిఫార్సుతో దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిరుపేదలకు భరోసా కల్పించేందుకు ఆరోగ్యశ్రీతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నవారికి సీఎంఆర్ఎఫ్ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. గతంలో సీఎంఆర్ఎఫ్ ఏ రకంగా ఉండేదో, ఇప్పుడు ఏ రకంగా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. గతంలో లక్షల రూపాయల నుంచి 15 లక్షల రూపాయల వరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన సందర్భాలు అనేకం ఉన్నాయని తెలిపారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని సరిగా అమలు చేయకపోవడం గమనార్హమని విమర్శించారు. 10 లక్షల రూపాయల బిల్ ఉన్న వారికి కేవలం 30 వేలు లేదా 40 వేల రూపాయల చెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ పథకాన్ని పునరాలోచించి, నిరుపేదలకు నిజమైన సహాయం అందించేలా చూడాలని సండ్ర వెంకట వీరయ్య కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బెల్లం వేణు, పగడాల నాగరాజు, పేరా వెంకటేశ్వరరావు, పాషా, అప్పారావు, బలుసు మురళీకృష్ణ, లింగన్నబోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లుగీతా కార్పొరేషన్ చైర్మన్‌గా నామినేట్ అయిన చంద్రశేఖర్ గౌడ్‌ను సన్మానించిన గౌడ సత్రం చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్



**గంగాధర మే 9(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజురాష్ట్ర ప్రభుత్వంచే నామినేట్ అయిన కల్లుగీతా సహకార పారిశ్రామిక సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మోత్కూరి చంద్రశేఖర్ గౌడ్ ను జగిత్యాల జిల్లా కొండగట్టు గౌడ నిత్యాన్నధాన సత్రం ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్, ట్రస్ట్ ప్రచార కార్యదర్శి కోరెపు శ్రీకాంత్ గౌడ్ లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘణంగా సన్మానించారు. రాష్ట్రంలోని కల్లుగీతా కార్మికుల సంక్షేమం కొరకు పాటుపడాలని కల్లుగీత వృత్తిని కాపాడి ఆధునిక పద్ధతులతో గీతా కార్మికులకు రక్షణ కల్పించాలని నూతనంగా నామినేట్ అయిన చైర్మన్ మోత్కూరి చంద్రశేఖర్ గౌడ్‌ను కోరినట్లు తెలిపారు. కొండగట్టు గౌడ నిత్యాన్నధాన సత్రం అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు.

# కల్లూరు నుంచి రాష్ట్ర క్రీడా పాఠశాలకు ఇద్దరు చిన్నారులు ఎంపిక

**కల్లూరు చిన్నారుల ఘనత రాష్ట్ర క్రీడా పాఠశాలకు అడుగు**

**శాంతినగర్ విద్యార్థుల విజయగాథ**

**కోచ్ వీర రాఘవయ్య మార్గదర్శకత్వం ఫలితం**

**గ్రీన్ ఫీల్డ్ స్టేడియం నుంచి రాష్ట్రస్థాయికి**

**కల్లూరు క్రీడా ప్రతిభకు కొత్త పుంతలు**

**పి.ఈ.టి వీర రాఘవయ్య కృషి ఫలించింది ఇద్దరు చిన్నారులు రాష్ట్ర క్రీడా పాఠశాలకు ఎంపిక**

**హకీంపేటలో అడ్మిషన్‌కు సిద్ధమైన శాంతినగర్ విద్యార్థులు**

**కల్లూరు, మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలో శాంతినగర్ ప్రాథమిక పాఠశాలకి చెందిన ఇద్దరు ప్రతిభావంతులైన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు ఎంపిక కావడం విశేషం. ఖమ్మంపాటి మహన్య, కాకటి లక్ష్మీ ప్రసన్న అనే ఈ



చిన్నారులు ప్రస్తుతం మూడవ తరగతి చదువుతూ తమ క్రీడా ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ విజయానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధురి, మండల విద్యాశాఖ అధికారి పత్తిపాటి నివేదిత, సహోపాధ్యాయులు గుర్రాల సుధీర్ అందించిన ప్రోత్సాహం కీలకంగా నిలిచింది. ప్రత్యేకంగా గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం, కల్లూరులో క్రీడా శిక్షణ అందించిన పి.ఈ.టి పసుపులేటి వీర రాఘవయ్య, కోచ్‌లు టీ గౌతమ్, ఎన్ గోపాల్, జి శ్రీనివాస్, ఫిజికల్ ట్రైనర్ నల్లగట్ల నాగబాబు, క్రీడా నిపుణుడు తుంబూరు సునీల్ రెడ్డి చేసిన కృషి ప్రశంసనీయమైంది. ఈ ఇద్దరు చిన్నారులు ఈ నెల 13, 14 తేదీల్లో హకీంపేట క్రీడా పాఠశాలలో అడ్మిషన్ పొందేందుకు వెళ్లనున్నారు. గ్రామ ప్రజలు, చిన్నారులు వీరిని అభినందిస్తూ ఆశీర్వదించారు. కల్లూరు ప్రాంతం నుంచి వెలుగొందుతున్న ఈ చిన్నారుల ప్రతిభ, కోచ్ వీర రాఘవయ్య వంటి గురువుల అంకితభావం వల్ల రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందుతోంది. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

# మహిళా కార్మికురాలిపై వేధింపులు చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**• పులేపెరియార్ అంబేద్కర్ ఆలోచన వేదిక అధ్యక్షుడు శ్రీహరి డిమాండ్**

**రామగుండం, మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :**రామగుండం ఆర్జీ-1 ఏరియాలోని సింగరేణి సంస్థలో పనిచేస్తున్న మహిళా కార్మికురాలు స్వప్నపై నిరంతరం వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై యాజమాన్యం తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పులేపెరియార్‌అంబేద్కర్ ఆలోచన వేదిక అధ్యక్షుడు శ్రీహరి డిమాండ్ చేశారు. గతంలో మహిళా కార్మికురాలిని వేధింపులకు గురిచేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో వారు జైలుకు వెళ్లినప్పటికీ, అదే వ్యక్తులు మళ్లీ సోషల్ మీడియా వేదికగా అసభ్య పదజాలంతో పాటల రూపంలో మహిళా కార్మికురాలిని అవమానించే విధంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల గౌరవాన్ని కించపరిచే విధంగా జరుగుతున్న ఈ దాడులను అన్ని కార్మిక సంఘాల నాయకులు ఖండించాలని కోరారు. ఒక యూనియన్‌కు చెందిన వ్యక్తి తప్పు చేస్తే, మిగతా యూనియన్ నాయకులు స్పందించకుండా మౌనం పాటించడం బాధాకరమన్నారు. కమ్యూనిస్టు పార్టీలు క్రమశిక్షణకు, నైతిక విలువలకు ప్రతీకలుగా చెప్పుకుంటూ, అదే సంఘానికి చెందిన వ్యక్తి మహిళా కార్మికురాలిపై వేధింపులకు పాల్పడుతున్నా పట్టించుకోకపోవడం విచారకరమని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత యూనియన్ అధిష్ఠానం స్పందించి, మహిళా కార్మికురాలిని వేధిస్తున్న వ్యక్తిపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని శ్రీహరి డిమాండ్ చేశారు.



## గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

**• శివసేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గౌటే**



**హైదరాబాద్, మే 09 (పిసిడబ్ల్యూ న్యూస్):** హిందూవుల ఆరాధ్యదైవమైన గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలనిశివసేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గౌటే కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 19న జాతీయ సెలవు దినంగా ప్రకటించే విధంగా ప్రధాని నరేంద్రమోదీకి బీజేపీ రాష్ట్ర శాఖ పక్షాని విజ్ఞప్తి చేయాలని ఆయన కోరారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన ఆదివారం హైదరాబాద్ వస్తున్న సందర్భంగా ప్రధానిని కలిసి వినతి పత్రం అందించనున్నట్లు ఆయన తెలిపారు. పార్లమెంట్ లో గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించే విధంగా గోమాత బిల్లును పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.

## పోచమ్మవాడ ప్రభుత్వ పాఠశాలకు బోర్ వెల్ ఏర్పాటు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్....






**కరీంనగర్ టౌన్ మే 09 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలోని 39వ డివిజన్ పోచమ్మవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నీటి సమస్య పరిష్కారానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో బోర్ వెల్ ఏర్పాటు చేశారు. శనివారం స్థానిక కార్పొరేటర్ మాసం గణేష్ బోర్ వెల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాసం గణేష్ మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను కేంద్ర మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లగానే ఆయన వెంటనే స్పందించి బోర్ మంజూరు చేయించారని తెలిపారు. పాఠశాల విద్యార్థులు, సిబ్బంది అవసరాలను దృష్టిలో పెట్టుకుని బోర్ ఏర్పాటు చేయించినందుకు కేంద్రమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు డి. హరీష్, ఉపాధ్యాయులు ఎం. రాజు, అంగన్‌వాడీ టీచర్ పద్మ, గోనెల రమేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# చలో పరేడ్ గ్రౌండ్: నేటి ప్రధాని మోదీ సభను సక్సెస్ చేయాలి..

**- వాహనల పోస్టర్ ఆవిష్కరించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

**కరీంనగర్ టౌన్, మే09(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 10 వ తేదీ ఆదివారం రోజున హైదరాబాద్ రానున్న నేపథ్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు బిజెపి శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి, సభను సక్సెస్ చేయాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రోజున కరీంనగర్ లోని టవర్ సర్కిల్లో ప్రధాని మోడీ సభకు తరలి వెళ్లే వాహనాలకు సంబంధించిన పోస్టర్ ను జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కోలగని శ్రీనివాస్, కార్పొరేటర్లు , బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మూడోసారి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారి హైదరాబాద్ వస్తున్నారని, ఈ నేపథ్యంలో లక్షలాది మందితో ఈనెల 10 ఆదివారం రోజున సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్లో నిర్వహించే సభను కనీవినీ ఎరగని రీతిలో విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ సభను సక్సెస్ చేయాల్సిన బాధ్యత నాయకులు కార్యకర్తలందరిపై ఉందన్నారు. ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా సభకు తరలిరావాలని కోరారు. ముఖ్యంగా కరీంనగర్ జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో ప్రజలను తరలించాలనే ఆలోచనతో జిల్లా పార్టీ ఉందని, ఆ దిశలో నే అన్ని మండలాల నుండి అధిక సంఖ్యలో జన సమీకరణ చేయాలని సూచించారు. సభకు స్వచ్ఛందంగా తరలివచ్చే వారి కోసం రవాణా, కనీస సౌకర్యాలను ఏర్పాటు చేశామని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆపరేషన్ సింధూర్ తరువాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్నారనీ, 3వ సారి ప్రధాని పగ్గాలు చేపట్టిన తరువాత హైదరాబాద్ తొలిసారి రాబోతున్న నేపథ్యంలో బీజేపీ నాయకులంతా తమ అనుచరులు, టీంతో తప్పనిసరిగా పరేడ్ మైదానానికి తరలి రావాలని కోరారు. ప్రతి ఒక్కరూ మోదీ సభకు ఆహ్వానిస్తూ మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రధాని మోడీ సభ సక్సెస్ తో తెలంగాణలో రాజకీయ ముఖచిత్రం మారిపోతుందని, రాష్ట్రవ్యాప్తంగా బిజెపి గాలి వీచే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలోకరీంనగర్ నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళ రమేష్ ,ఇనుగొండ






నాగేశ్వర్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, కార్పొరేటర్లు వంగల పవన్ కుమార్, కె ఏపీపీ చంద్ర తోట అనిల్, కన్న కృష్ణ, సర్దార్ బల్బీర్ సింగ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు, దండు కొమురయ్య, మండల/ జోన్ అధ్యక్షులు తణుకు సాయి కృష్ణ, భూమల అనిల్ కుమార్, ముత్తునూటి హరీష్ , కుంట తిరుపతి ,కొండల్ రెడ్డి ,దొంతుల రమేష్, ర్యాకం శ్రీనివాస్, బీజేపీ ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు అడిచెర్ల , ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ ,దూలం అనిల్ ,కలికోట మోహన్ కచ్చకాయల రాజు సతీష్ ,శశి , భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోడీ మార్క్ రాజకీయాలు...

## భారత్ పయనం ఎటువైపూ... బానిసత్వం వైపా..! స్వేచ్ఛ వైపా..!




నేటి భారతదేశ రాజకీయ ముఖచిత్రం ఒక క్లిష్టమైన సంధి కాలంలో ఉంది. దశాబ్దాల పాటు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిన దేశం, నేడు 'ఒకే దేశం – ఒకే సంస్కృతి' అనే నినాదం వెనుక తన వైవిధ్యాన్ని కోల్పోతోంది. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం మతాన్ని రాజకీయ ఆయుధంగా మార్చుకుని, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చరిత్ర పుటలను తిరగేస్తే, అధికారాన్ని నిలబెట్టుకోవడానికి పాలకులు అనుసరించే మార్గాలు కాలంతో పాటు మారుతుంటాయి. 16వ శతాబ్దంలో ఇటలీకి చెందిన రాజనీతి తత్వవేత్త నికోలో మాఖియావెలి తన ప్రసిద్ధ గ్రంథం 'ది ప్రిన్స్' (The Prince) ద్వారా రాజకీయాలను మతం మరియు నైతికత నుండి వేరు చేసి, "రాజకీయ లౌకిక వాదానికి" పునాది వేశారు. కానీ, నేటి భారతదేశంలో ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో రాజకీయాలు మళ్లీ మతంతో ముడిపడి, ఒక విలక్షణమైన మలుపు తిరుగుతున్నాయి. ఈ పరిణామం రాజ్యాంగ వ్యవస్థల పతనం వైపు దారి తీస్తోందా? భారతీయులను ఆధునిక యుగం నుండి మధ్య యుగపు ఆలోచనా ధోరణిలోకి నెడుతోందా? అన్నది నేడు మేధావుల ముందున్న ప్రధాన ప్రశ్న.ద మాఖియావెలి కంటే ముందు, పాలన అనేది దైవ కార్యంగా భావించబడేది. మాఖియావెలి దానిని తలకిందులు చేశారు. "పాలన అనేది వాస్తవికత మీద ఆధారపడి ఉండాలి, ఆదర్శాల మీద కాదు." అని మాఖియావెలి స్పష్టం చేశారు. మాఖియావెలి మతాన్ని వ్యక్తిగత విషయంగా చూశారు. రాజకీయాలలో మతాన్ని కేవలం ప్రజలను నియంత్రించే ఒక 'సాధనం'గా మాత్రమే వాడాలని సూచించారు తప్ప, మతమే రాజకీయంగా మారకూడదన్నారు. "ఒక పాలకుడు దయాగుణం, విశ్వాసం, మానవత్వం, మత విశ్వాసం కలిగి ఉన్నట్టు కనిపించడం అవసరం, కానీ వాటిని నిజంగా కలిగి ఉండటం ప్రమాదకరం." – నికోలో మాఖియావెలి. మాఖియావెలి రాజకీయాల నుండి మతాన్ని వేరు చేయాలని చెబితే, నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ మతాన్ని రాజకీయాలకు ప్రధాన ఇంధనంగా మార్చుకుంది. "మతం అనేది వ్యక్తిగత విశ్వాసం కావాలి, కానీ అది అధికార పీఠానికి నిచ్చెనగా మారినప్పుడు... మానవత్వం మంటగలిసి, మతోన్మాదం రాజ్యమేలుతుంది." అయోధ్య రామమందిర నిర్మాణం నుండి 'హిందుత్వ' నినాదం వరకు, ప్రతి అంశం ఓట్ల సమీకరణకు సాధనంగా మారింది. ఇది కేవలం భక్తి మాత్రమే కాదు, ఒక రాజకీయ అస్త్రం. బిజెపి అనుసరిస్తున్న రాజకీయ విధానం కేవలం అభివృద్ధి చుట్టూ కాకుండా, మతపరమైన భావోద్వేగాల చుట్టూ తిరుగుతోంది. రామ మందిరం నుంచి ఆర్టికల్ 370 రద్దు వరకు, ప్రతి అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం మత రంగు పులిమి వాడుకోవడం కనిపిస్తుంది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీషర్లు వాడిన విభజించు – పాలించు సూత్రాన్ని, నేడు మతం ప్రాతిపదికన ఓటర్లను చీల్చడానికి ఉపయోగిస్తున్నారు. ఎన్నికల సమయంలో ద్వేషపూరిత ప్రసంగాలు చేయడం, ప్రత్యర్థులను శత్రువులుగా, ఒక వర్గం ప్రజలను పరాయి వారిగా చిత్రించడం ప్రజాస్వామ్య పునాదులను కదిలిస్తోంది. రాజకీయాలకు మతం తోడైనప్పుడు, తటస్థంగా ఉండాల్సిన వ్యవస్థలు ప్రభావితమవుతాయి. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, మీడియా వంటి ప్రజాస్వామ్య స్తంభాలు మతపరమైన భావోద్వేగాల ముందు తలవంచుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. రాజ్యాంగంలోని 'సెక్యులరిజం' (లౌకికవాదం) అనే ఆత్మ క్రమంగా క్షీణిస్తోంది. భారత రాజ్యాంగం 'లౌకిక వాదం' మీద నిలబడింది. కానీ నేడు వ్యవస్థలన్నీ ఒకే భావజాలం క్రిందకు వెళ్తున్నాయి. ఈసీ ), సీబీఐ , ఈడీ (జుణ) వంటి స్వతంత్ర సంస్థలు స్వయం ప్రతిపత్తిని కోల్పోయి, నిర్వీర్యం అవుతూ, అధికార పార్టీకి కీలు బొమ్మలుగా మారాయన్నది బహిరంగ రహస్యం. ప్రభుత్వాన్ని ప్రశ్నించే జర్నలిస్టులు, మేధావులను 'దేశ ద్రోహులు'గా ముద్ర వేయడం, భావప్రకటనా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపడంతో మనుగడలో ఉన్న ప్రజాస్వామ్యానికి మరణశాసనం లిఖించబడుతుంది. ఆధునిక భారతంలో 'మనువాదం' మళ్లీ కొత్త రూపంలో ప్రవేశిస్తోంది. దళితులు, గిరిజనులు మరియు మైనారిటీల పట్ల పెరుగుతున్న హింస, వివక్ష దీనికి నిదర్శనం. రాజ్యాంగం కల్పించిన సమానత్వాన్ని కాలరాస్తూ, వర్ణ వ్యవస్థలోని ఆధిపత్య పోకడలను పరోక్షంగా ప్రోత్సహించడం ఆందోళనకరం మనువాద పోకడలతో ఆర్థిక, సామాజిక అసమానతలు పెరిగిపోతున్నాయిఅధికారం కోసం బీజేపీ అనుసరిస్తున్న వ్యూహాల్లో మతపరమైన హింస ఒక భాగంగా మారింది. అధికార దాహంతో హింస పెరిగిపోతుంది. అల్లర్లు సృష్టించడం ద్వారా ప్రజల మధ్య అగాధాన్ని పెంచి, ఆ అభద్రతా భావం నుంచి ఓట్లను పిండుకోవడం ఒక విష సంస్కృతికి తెరలేపింది. మత ఘర్షణలు కేవలం ప్రాణాలను తీయడమే కాకుండా, దేశ ఆర్థిక మరియు సామాజిక ఐక్యతను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. మాఖియావెలి చెప్పినట్టు, అధికారాన్ని కాపాడుకోవడానికి పాలకుడు ఏదైనా చేయవచ్చు (ఙష్టవ వఅఇ యబర్అటఅవర్ ష్టవ ఎముఅం). కానీ మోదీ మతాన్ని ఉపయోగించి ప్రజామోదాన్ని పొందుతూ, రాజ్యాంగ నియమాలను తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చుకుంటున్నారు. నేటి పరిస్థితులు అంబేద్కర్ భయపడిన ఆ రోజులను గుర్తు చేస్తున్నాయి. సంప్రదాయాల పేరుతో అణచివేతను సమర్థించే ధోరణి పెరుగుతోంది. "రాజ్యాంగం ఎంత గొప్పదైనా, దానిని అమలు చేసే వ్యక్తులు దుర్మార్గులైతే అది విఫలమవుతుంది." – డా. బి.ఆర్. అంబేద్కర్ ఒక దేశం ఆర్థికంగా ఎంత అభివృద్ధి చెందినా, సామాజికంగా వెనక్కి వెళ్తుంటే ఆ అభివృద్ధికి అర్థం లేదు. మతం మనిషికి శాంతిని ఇవ్వాలి, కానీ రాజకీయాలకు ఆయుధంగా మారకూడదు. ప్రజలను విద్య, వైద్యం, ఉపాధి వంటి ఆధునిక సమస్యల వైపు కాకుండా, గత చరిత్రలోని గొడవలు, మతపరమైన ఆధిపత్యం వైపు మళ్లించడం ద్వారా దేశాన్ని 'మధ్యయుగపు మత బానిసత్వం' వైపు తీసుకెళ్తున్నారనే విమర్శ బలంగా వినిపిస్తోంది. భారతదేశం అంటే కేవలం భూభాగం కాదు, కోట్లాది మంది ప్రజల నమ్మకం మరియు వైవిధ్యం. మతం పేరుతో దేశాన్ని విడదీయడం, రాజ్యాంగ విలువులను పక్కన పెట్టడం భావి తరాలకు మనం ఇచ్చే చేదు బహుమతి. మేధావులు, యువత మరియు సామాన్య ప్రజలు నిద్ర మేల్కోవాల్సిన సమయం ఇది. "ప్రజాస్వామ్యంలో మౌనం అనేది నిరంకుశత్వానికి ఇంధనం వంటిది. ప్రశ్నించడమే ప్రజాస్వామ్యానికి ప్రాణం." రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అంటే దేశాన్ని కాపాడుకోవడమే. మత రాజకీయం తాత్కాలికంగా అధికారాన్ని ఇవ్వవచ్చు, కానీ అది దేశ ఆత్మను చంపేస్తుంది. "మతం అనేది రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు, అది మతాన్ని భ్రష్టు పట్టిస్తుంది మరియు రాజకీయాలను విషపూరితం చేస్తుంది." నేటి భారతీయులు తమను తాము ప్రశ్నించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. మనం రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామా? లేక మతపరమైన ఉద్వేగాల మధ్య బందీలుగా మారుతున్నామా? అంధ విశ్వాసాల నుండి బయటపడి, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

- ది. 09.05.2026 విశ్వ జంపాల,
న్యాయవాది విశ్వ సమాజం
వ్యవస్థాపకులు మొబైలు నం.
7793968907

## 25 ఏళ్లుగా మస్జిదే మొహమ్మదిలో సేవలందిస్తున్న మోజన్ షేక్ తాహెర్‌కు ఘన సన్మానం...



**కరీంనగర్ టౌన్ మే 09(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని 53వ డివిజన్ సాహేత్‌నగర్‌లోని మస్జిదే మొహమ్మదిలో మోజన్‌గా సేవలందిస్తున్న షేక్ తాహెర్ అదే మసీదులో 25 సంవత్సరాల సేవలను పూర్తి చేసుకున్న సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గతంలో హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మోజన్‌లకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సదర్ ఆల్ ఇండియా సూఫీ ఒలమ్మ కౌన్సిల్ హకీం సయ్యద్ షా మొహమ్మద్ ఖైరుద్దీన్ ఖాద్రి గారి చేతుల మీదుగా షేక్ తాహెర్ గారికి సర్టిఫికెట్ మరియు షీల్డ్ ప్రదానం చేయబడింది. ఈ సందర్భంగా శుక్రవారం నమాజ్ అనంతరం కరీంనగర్ సాహేత్‌నగర్ మస్జిదే మొహమ్మదిలో కాంగ్రెస్ నాయకుడు ఎండి మీరాజుద్దీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం జరిగింది. మోజన్ షేక్ తాహెర్ కి శాలువా కప్పి ఘనంగా సత్కరించడంతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు, పెద్దలు, యువకులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యాదవుల ఆత్మగౌరవంపై 'నామినేటెడ్' దెబ్బ

**ఖమ్మం జిల్లాలో రగిలిన నిరసన జ్వాల!**

**కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమించినా దక్కని గుర్తింపు**

**మంత్రులను కలిసి విన్నవించాలని నిర్ణయం**

**హెచ్చరించిన యాదవ మహాసభ**





**ఖమ్మం ప్రతినిధి, మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలు శ్రమించిన యాదవ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల నియామకాల్లో తీరని అన్యాయం జరిగిందని అఖిల భారత యాదవ మహాసభ గళమెత్తింది. జిల్లాలో బలమైన ఓటు బ్యాంకుగా ఉండి, పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన తమను విస్మరించడంపై నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు తమ ఆవేదనను, ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. **త్యాగాలకు గుర్తింపు ఏది? మేకల మల్లి బాబుయాదవ్‌కు జరిగిన అన్యాయంపై చర్చ** ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, చిత్తారు సింహాద్రి యాదవ్, దుబాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో యాదవులకు దక్కిన రాజకీయ ప్రాధాన్యతను గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా నుండి ఒక్కరికి కూడా రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి దక్కకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యంగా 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ, గత ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా యాదవులను ఏకం చేసిన మేకల మల్లిబాబు యాదవ్ అంకితభావాన్ని ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు. ఎన్నికల ముందు అక్రమ కేసులతో జైలు జీవితం గడిపి, ఆర్థికంగా, మానసికంగా నష్టపోయిన వారిని కేవలం ఓట్ల కోసమే వాడుకున్నారా? అని ప్రశ్నించారు. **'గొర్రెలు కాచుకునే వాళ్లని చులకన చూడొద్దు' ఆందోళన బాట పట్టనున్న యాదవ లోకం** యాదవుల సత్తా ఏమిటో చూపించే రోజులు దగ్గరపడ్డాయని నేతలు హెచ్చరించారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులను కలిసి తమ గోడును విన్నవిస్తామని, అయినా ఫలితం లేకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. "మేము గొర్రెలు కాచుకునే వాళ్లమే కావచ్చు.. కానీ రాజకీయ గమనాన్ని మార్చగల సత్తా మాకుంది. మమ్మల్ని చులకనగా చూడటం ప్రభుత్వానికి తగదు" అని నాయకులు ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కనకబండి విజయలక్ష్మి, చేతుల నాగేశ్వరరావు, మొరిమేకల కోటయ్య తదితరులు పాల్గొని, తక్షణమే యాదవులకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

## అపన్న హస్తం.. పేదవాడి కన్నీరు తుడిచిన 'మధు'ర సహాయం..!

**• ఖమ్మం కార్పొరేషన్ వేదికగా రూ. 20.62 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ • ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చొరవపై సర్వత్రా హర్షం**






**ఖమ్మం ప్రతినిధి, మే 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కష్టాల్లో ఉన్న పేదవాడికి నేనున్నానంటూ భరోసా కల్పించడం కంటే గొప్ప మానవత్వం మరొకటి లేదు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న పదుల సంఖ్యలో కుటుంబాలకు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తన ప్రత్యేక చొరవతో సర్కారు అండను అందించారు. మంగళవారం ఖమ్మం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం సాక్షిగా లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వులు పూయించారు. **పేదరికంపై పోరులో 'గులాబీ' నీడ బాధితులకు భరోసా** ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నిరంతర సిఫారసుల ఫలితంగా మంజూరైన మొత్తం రూ. 20,62,000 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఇతర ముఖ్య నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆపద కాలంలో పేదలకు కొండంత అండగా నిలిచేందుకు తాతా మధుసూదన్ గారు పడుతున్న తపన అభినందనీయమని కొనియాడారు. పార్టీ కార్యాలయం కేవలం రాజకీయం కోసమే కాకుండా, సాయం కోరి వచ్చే సగటు మనిషికి ఒక వేదికగా నిలుస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. **కేసీఆర్ హయాం ఒక స్వర్ణయుగం ప్రస్తుత పరిస్థితులపై ఆవేదన** చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ భావోద్వేగంతో మాట్లాడారు. "గతంలో కేసీఆర్ నాయకత్వంలో సీఎం సహాయ నిధి పంపిణీ ఒక పండగలా జరిగేది. వేల కుటుంబాలు కోట్లాది రూపాయల సాయం పొంది ప్రాణాపాయం నుండి బయటపడ్డాయి. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎంత పెద్ద జబ్బుకైనా సాయాన్ని కేవలం రూ. 60 వేలకే పరిమితం చేయడం అత్యంత బాధాకరం. ఇది నిరుపేద కుటుంబాలను కోలుకోలేని దెబ్బ తీస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు నిజమైన న్యాయం జరగాలంటే మళ్లీ కేసీఆర్ గారి దూరదృష్టి కలిగిన పాలన అవసరమని ఆయన పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారుల దగ్గరకు స్వయంగా వెళ్లి, వారిని ఆత్మీయంగా పలకరించి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, నాయకులు ముత్యాల వెంకటప్పారావు, పొట్ల ప్రసాద్, మహమ్మద్ రఫీ, పేరం వెంకటేశ్వర్లు, బలుసు మురళీకృష్ణ, లింగనబోయిన సతీష్, లెనిన్ చౌదరి తదితరులు పాల్గొని సేవా దృక్పథాన్ని చాటుకున్నారు.

# తమిళనాట భేతాళ ప్రశ్నలు...??

తమిళనాట ప్రతిష్ఠంభనకు చిన్న పార్టీలు ఆడుతున్న పెద్ద డ్రామాలు కలుషిత రాజకీయాలకు పరాకాష్టగాచూడాలి. లెఫ్ట్ పార్టీలు, ముస్లిం పార్టీ సహా ఇతర చిన్న పార్టీలు ఒకటి అరా సీటు సంపాదించినా బేరాలాడుతున్న తీరు వల్ల తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు ఆటంకాలు వస్తున్నాయి. ఈ క్రమంలో తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. టీవీకేకు ఏఎంఎంకే మద్దతు ఇచ్చినట్లు వస్తున్న వార్తలను ఆ పార్టీ అధినేత దినకరన్ తోసిపుచ్చారు. తమ ఎమ్మెల్యే మద్దతిస్తున్నారని పేర్కొంటూ గవర్నర్‌కు టీవీకే నేతలు జిరాక్స్ కాపీ ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. అయితే, అసలైన లేఖ ఎక్కడుందో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అది లభిస్తేనే వాస్తవాలు బయటపడతా యన్నారు. లేఖపై తాను సంతకం చేస్తున్నట్లు టీవీకే విడుదల చేసిన వీడియోపై ఏఎంఎంకే ఎమ్మెల్యే కామరాజ్ స్పందిస్తూ.. అది కృత్రిమ మేధ ఆధారిత వీడియో అని ఆరోపించారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమంటూ టీవీకే అధినేత విజయ్ వరుసగా గవర్నర్‌ను కలుస్తుండటంపై డీఎంకే విమర్శలు గుప్పించింది. గవర్నర్‌ను సంప్రదించడానికి ముందే ఇతర పార్టీల మద్దతును కూడగట్టుకోవాలని సూచించింది. ఎమ్మెల్యేల మద్దతు లేకుండా గవర్నర్‌కు లేఖ ఎందుకు ఇవ్వడమని ప్రశ్నించింది. రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించా లని పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ పేర్కొన్నారు. ప్రజాతీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాల్సిందే నన్నారు. ప్రభుత్వ ఏర్పాటు పక్రియలో జాప్యం చేయొద్దని.. వెంటనే దీనిని పూర్తిచేయాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మెజార్టీ లేక ప్రభుత్వ ఏర్పాటులో ఇబ్బందులు పడుతున్న విజయ్.. త్వరలో వీసీకే చీఫ్‌ను కలవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈసందర్భంగా తమకు మద్దతు ఇవ్వాలని కోరనున్నట్లు తెలిసింది. ప్రజా తీర్పును వమ్ము చేసేలా చిన్న పార్టీలు దోబూచులాడు తున్నాయి. మద్దతుకు ఓకే చెప్పి గవర్నర్‌కు లేఖలు అందించడంలో వెనక్కి తగ్గాయి. దీంతో మెజార్టీ విషయంలో గవర్నర్ సంతృప్తి చెందక పోవడంతో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. 234 స్థానాలున్న అసెంబ్లీలో 108 స్థానాల్లో విజయ దుందుభి మోగించింది. అధికారం పొందడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ కు కేవలం పదకొండు స్థానాలు తక్కువ. ఇటువంటి పరిస్థితిలో అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నేతను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించడం అన్నది కేవలం ఆనవాయితీ మాత్రమే. గతంలో అటల్ బిహారి వాజ్‌పేయి నాయకత్వంలోని బిజెపికి నాటి రాష్ట్రపతి అటువంటి అవకాశం ఇవ్వడం 13 రోజుల్లో మెజారిటీ రుజువు చేసుకోలేక వాజ్‌పేయి రాజీనామా చేసిన విషయం అందరికీ తెలిసిందే! దేశంలోనూ వివిధ రాష్ట్రాల్లోనూ ఇటువంటి దృష్టాంతాలెన్నో జరిగాయి. అయితే ప్రమాణానాఇకి ముందు మద్దతు లేఖలతో సం÷–యా బలం తెలుసుకోవడం గవర్నర్ విధి. దీనిని ఎవ్వరూ తప్పు పట్టాల్సిన పనిలేదు. తమిళనాడు ప్రజలు విజయ్ నాయకత్వంలోని టివికె పార్టీకి మె.ఆర్టీ సీట్లు కట్టబెట్టారు. ఫలితాలు వచ్చిన మరునాడే అతి పెద్ద పార్టీగా వచ్చిన తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ చేసిన విజ్ఞప్తిని గవర్నర్ ఆహ్వానిస్తూనే మద్దతు లేఖలు కోరారు. అయితే విజయ్ కూడా ఈ విషయంలో కొంత డ్రామాలు ఆడుతున్నట్లుగా ఉంది. అయిదు సీట్లున్న కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉన్నప్పటికీ మెజారిటీకి అవసరమైన మద్దతు మాత్రం చూపడం లేదు. తమిళ ప్రజా తీర్పును అమలు చేయడానికి తమిళనాట



గందరగోళం సృష్టించాలని తమిళ పార్టీలే యత్నిస్తున్నాయి. వామపక్షాలు బేషరతు నిర్ణయం తీసుకొని టివికె ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ప్రకటించాయి. విసికె మద్దతు లేఖ ఇస్తే మేజిక్ ఫిగర్ చేరుకోవడం సులువవుతుంది. ఈ క్రమంలో తమిళనాడులో నూతన ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా ప్రతిష్టంభన వీడలేదు. విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. ప్రభుత్వ ఏర్పాటుకు సతమతమవుతోంది. చిన్న పార్టీల మద్దతు ఉందని చెబుతూ మూడు రోజుల్లో మూడుసార్లు గవర్నర్‌ను కలిసినా.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆ రాష్ట్ర లోక్‌భవన్ నుంచి పిలుపు రాకపోవడం తమిళ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠగా మారింది. ఇదంతా కేవలం మద్దతు ఇస్తున్న పార్టీల లేఖలు సమకూర్చడంలో చేస్తున్న జాప్యంగానే చయేడాలి.




## తమిళనాట కొనసాగుతున్న సందిగ్ధత

**• విజయ్ తీరుపై డిఎంకె ఆగ్రహం**

**చెన్నై,మే9:** తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమంటూ టీవీకే అధినేత విజయ్ వరుసగా గవర్నర్‌ను కలుస్తుండటంపై డీఎంకే విమర్శలు గుప్పించింది. గవర్నర్‌ను సంప్రదించడానికి ముందే ఇతర పార్టీల మద్దతును కూడగట్టుకోవాలని సూచించింది. ఎమ్మెల్యేల మద్దతు లేకుండా గవర్నర్‌కు లేఖ ఎందుకు ఇవ్వడమని ప్రశ్నించింది.రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాలని పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ పేర్కొన్నారు. ప్రజాతీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాల్సిందేనన్నారు. ప్రభుత్వ ఏర్పాటు పక్రియలో జాప్యం చేయొద్దని.. వెంటనే దీనిని పూర్తిచేయాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మెజార్టీ లేక ప్రభుత్వ ఏర్పాటులో ఇబ్బందులుపడుతున్న విజయ్.. త్వరలో వీసీకే చీఫ్‌ను కలవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈసందర్భంగా తమకు మద్దతు ఇవ్వాలని కోరనున్నట్లు తెలిసింది. టీవీకేకు ఏఎంఎంకే మద్దతు ఇచ్చినట్లు వస్తున్న వార్తలను ఆ పార్టీ అధినేత దినకరన్ తోసిపుచ్చారు. తమ ఎమ్మెల్యే మద్దతిస్తున్నారని పేర్కొంటూ గవర్నర్‌కు టీవీకే నేతలు జిరాక్స్ కాపీ ఇచ్చినట్లు తెలుస్తోంద న్నారు. అయితే, అసలైన లేఖ ఎక్కడుందో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అది లభిస్తేనే వాస్తవాలు బయటపడతాయన్నారు. లేఖపై తాను సంతకం చేస్తున్నట్లు టీవీకే విడుదల చేసిన వీడియోపై ఏఎంఎంకే ఎమ్మెల్యే కామరాజ్ స్పందిస్తూ.. అది కృత్రిమ మేధ ఆధారిత వీడియో అని ఆరోపించారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

## ఎక్స్ బయోను అప్‌డేట్ చేసిన మమత

**• మాజీ సిఎంగా పేరు మర్చుకున్న దీదీ**



**కోల్‌కతా,మే9:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన మమతా బెనర్జీ.. ఎట్టకేలకు తన పరాజయాన్ని అంగీకరించారు. రాష్ట్రంలో భాజపా సర్కారు కొలువుదీరిన నేపథ్యంలో.. ఆమె తన ఎక్స్ బయోను అప్‌డేట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన మమత ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సీఎం పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించారు. ఆ తర్వాత మే 7వ తేదీతో అసెంబ్లీ గడువు పూర్తైన నేపథ్యంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి దానిని రద్దు చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. నేడు రాష్ట్ర సీఎంగా భాజపా (నేత సువేందు అధికారి ప్రమాణం చేశారు. దీంతో దీదీ తన ఎక్స్ బయోను అప్‌డేట్ చేశారు. 'అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి (15, 16, 17వ విధానసభ)' అని మార్చుకున్నారు. అంతకుముందు 'పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి' అని మాత్రమే ఉండేది.

## అతిపెద్ద పార్టీ అయినా ప్రతిపక్షంలో ఉన్నాం

**• పార్లమెంటులో ప్రమోద్ మహాజన్ ఛతురోక్తులు**


**న్యూఢిల్లీ,మే9:** భారత రాజకీయాలపై దివంగత భాజపా నేత ప్రమోద్ మహాజన్ గతంలో ఓసారి పార్లమెంటులో చేసిన ప్రసంగం ప్రస్తుతం వైరల్‌గా మారింది. వాజ్‌పేయ్ 13 రోజుల పాలన అనంతరం మెజార్టీ నిరూపిచుకోవడంలో విఫలం కావడంతో విపక్షంలో కూర్చుకున్నారు. 1997 ఏప్రిల్ 11న లోక్‌సభలో విశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా నాటి భాజపా నేత ప్రమోద్ మహాజన్ ప్రసంగిస్తూ సంకీర్ణ రాజకీయాల్లో వైరుధ్యాల గురించి తనదైన శైలిలో వివరించారు. ఈ క్రమంలో గతంలో పార్లమెంటరీ బృందం చైనా పర్యటన విషయాలను ఉదహరించారు. భారత ప్రజాస్వామ్యం ఎలా పనిచేస్తుందనే విషయాన్ని తెలుసుకునేందుకు చైనా ప్రతినిధులు ఆసక్తి చూపించారని.. వారికి ఆ విషయాలను ప్రమోద్ వివరించిన తీరు సభలో హాస్యం పండించింది. నేను



ప్రమోద్ మహాజన్. లోక్‌సభ సభ్యుడిని. అతిపెద్ద రాజకీయ పార్టీకి చెందిన నేతను. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నాను. కాంగ్రెస్ ఎంపీ శ్రీబల్లవ్ పాణిగ్రహీని చూపిస్తూ.. ఆయన రెండో అతిపెద్ద పార్టీకి చెందినవారు. ప్రభుత్వం బయట ఉన్నప్పటికీ.. ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారు. సీపీఎం నేత ఎంఏ బేబీని పరిచయం చేస్తూ.. ఆయన మూడో అతిపెద్ద పార్టీకి చెందినవారు. కూటమిలో ఉన్నారు కానీ ప్రభుత్వంలో లేరు. చివరగా.. రమాకాంత్ ఖలాప్ (నాడు మహారాష్ట్రవాదీ గోమంతక్ పార్టీ నేత). ఆ పార్టీకి చెందిన ఒకే ఒక సభ్యుడు. కానీ, ప్రభుత్వంలో ఉన్నారు‘ అని ప్రమోద్ మహాజన్ వివరించడంతో సభలో నవ్వులు విరిశాయి. 1996 లోక్‌సభ ఎన్నికల్లో అతిపెద్ద రాజకీయ పార్టీగా భాజపా అవతరించినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ రాలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు నాటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ ఆహ్వానించడంతో వాజ్‌పేయీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే, ప్రాంతీయ పార్టీల మద్దతు లభిస్తుందని ఆయన భావించినప్పటికీ.. వారు తోడుగా నిలవకపోవడంతో ప్రభుత్వం కూలిపోయింది. దీంతో 13 రోజులకే వాజ్‌పేయీ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత భాజపా, కాంగ్రెస్ మినహా మిగతా పార్టీలు యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పాటవగా దేవెగౌడ ప్రధాని అయ్యారు. ఆ సమయంలో కాంగ్రెస్ ఈ ప్రభుత్వానికి వెలుపలి నుంచి మద్దతు ప్రకటించింది.

## మలమల మాడే ఎండల్లో... దినదిన గండంగా రైతులు!

వరి కోతలు కోసి ఇరవై ఏడురోజులు దాటింది. ఇరవై రోజుల వరకు కొనుగోలు చేసే నాథుడే లేడు. ప్రతిరోజు ఎండల్లో వడ్లను ఎండబెట్టడం కొరకు నేర్పుతూ కుప్పలు పోస్తూ మండేఎండల్లో శ్రమిస్తూ రైతులు వడదెబ్బకు తల్లడిల్లి పోతున్నారు. కేంద్రంలోని బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం వరి కొనుగోలు చేయమని మొండికేసింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంతో ఏమి పట్టనట్లు ఉదాసీనంగా ఉంది. లక్షలాదిమంది తెలంగాణ, దేశంలోని రైతాంగం దిక్కుతోచక ఎండల్లో వరి కుప్పల మధ్యనే ఇంటిల్లిపాది, కూలీల జీవితం గడిచిపోతోంది. వరి కుప్పలు కాంటాలు వేసి లారీలలో మిల్లులకు చేర్చే విలువైన కాలంలో ఇరవై రోజులు వృథాగా గడిచిపోయింది. తెలంగాణలో ప్రతి 40 కిలోల బస్తాకు మిల్లర్లు వడ్లు కేజీల చొప్పున దర్జాగా దోచుకుంటున్నారు. అంటే ప్రతి క్వింటాల్‌కు 8 కిలోల చొప్పున దిగ్గోస్తున్నారు. ప్రతి రైతు క్వింటాలుకు 190 రూపాయలు మిల్లర్లకు అర్పిస్తున్నారు. తెలంగాణలో మొత్తం వరి ధాన్యం సేకరణ ను గణిస్తే మిల్లర్ల రూ.వేల కోట్ల భారీ దోపిడీ తేలుతుంది.కొనుగోలు కేంద్రం వద్ద వరి ధాన్యం కాంటా కోసం క్వింటాలకు అరవై రూపాయలు ప్రతి రైతు అధికారికంగా హమాలీ చెల్లిస్తున్నారు. క్వింటాలుకు 8 కిలోల మిల్లర్ల దోపిడీ 190 రూపాయలు. క్వింటాలకు మిల్లు వద్ద హమాలీ దోపిడీ రెండు రూపాయలు.ఈ లెక్కన ప్రతి క్వింటాలుకు రైతు 252 రూపాయలు, వంద క్వింటాళ్లకు ప్రతి రైతు 26,200 నష్టపోతున్నారు.రాష్ట్రంలోని పలు జిల్లాలలో ఆదివారం కురిసిన అకాల వర్షాలు రైతులకు ఎనలేని నష్టాన్ని మిగిల్చాయి. కల్లాళ్లు, కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. చేతికి అందిన పంట తడిసిపోవడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు. మామిడి, నిమ్మ, బత్తాయి తోటల్లో కాయలు నేలరాలి భారీ నష్టం వాటిల్లింది. సూర్యాపేటలో ధాన్యం నీటి పాలయ్యింది. ఖమ్మం, కొత్తగూడెం అనేక జిల్లాల్లో వర్షాలకు పంటలు తీవ్రంగా నష్టపోయాయి. మహబూబాబాద్ జిల్లా కొరివి మండలం సోధన పల్లి కొనుగోలు కేంద్రంలో తడుస్తున్న ధాన్యాన్ని రక్షించుకునేందుకు టార్పాలిన్ కప్పుతుండగా పిడుగుపాటుకు గురై రైతు నీలం వెంకన్న మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని ఆరబెట్టిన గౌరయ్య



సాయంత్రం నాలుగు గంటల సమయంలో మబ్బులు పడుతుండడంతో ధాన్యాన్ని కుప్పపోస్తూ కుప్పకూలిపోయాడు. రైతుల ఈ దుస్థితికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. **గోనె సంచులు లేవు.. గోదాములు లేవు** రాష్ట్రంలో మక్కల అమ్మకం రైతులకు పెనుగండంగా మారింది. మద్దతు ధర 2400 ఉంటే, బహిరంగ మార్కెట్లో మక్కలు క్వింటాలుకు 1600–1700 పలుకుతుంది. మద్దతు ధర కంటే రూ.800 ప్రతి రైతు క్వింటాలుకు నష్టపోతున్నారు. రైతు సంఘాలు ప్రతిపక్షాల ఒత్తిడి మేరకు మక్కల కొనుగోలు బాధ్యతను మార్క్‌ఫెడ్‌కు అప్పగించారు. నిలువకు మౌలిక సదుపాయాలు గోదాములు లేకపోవడం వల్ల మార్క్‌ఫెడ్, ఫ్యాక్స్ సహకార సంఘాలకు దిన దిన గండంగా మారింది. రాష్ట్రంలో గత యాసంగిలో నాలుగు లక్షల ఎకరాల మక్కల సాగైతే, ఈ యాసంగిలో రైతులు 16.25 లక్షల ఎకరాలలో మక్కలు సాగు చేశారు. ప్రతి ఎకరాకు 23.50 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అలా 43.2 0 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలు ఉత్పత్తి కావడంతో మార్క్‌ఫెడ్ తల పట్టుకుంది.గోనె సంచులు లేవు. సంచుల సరఫరా కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. గోనె సంచులు తీసుకువచ్చిన రైతుల మక్కలను మాత్రమే ప్యాక్స్ సంఘాల నాయకులు కాంటాలు వేస్తున్నారు. హమాలీల సమస్య తీవ్రంగా ఉంది. గోదాములు లేక కాంట వేసిన మక్కలను నిలువ చేయడం మార్క్ ఫెడ్ కు ప్రధాన సమస్యగా మారింది.

# కొత్త అవతారంలోకి రోహిత్ శర్మ!




ఇండియన్ క్రికెట్ దిగ్గజం, సిక్సర్ల మెషిన్ రోహిత్ శర్మ ఇప్పుడు సరికొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నాడు. కేవలం క్రికెట్ పిచ్‌కే పరిమితం కాకుండా టెలివిజన్ ప్రపంచంలోకి తన అరంగేట్రం ఖరారు చేశాడు. దీనికి సంబంధించిన ఒక ఇంట్రెస్టింగ్ టీజర్‌ను సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్ రిలీజ్ చేసింది. ఈ టీజర్ చూస్తుంటే రోహిత్ ఒక స్పెషల్ షోతో రాబోతున్నట్లు అర్థమవుతోంది. త్వరలోనే ఈ షో టైటిల్, కాన్సెప్ట్ గురించి మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ తరపున రోహిత్ శర్మ తన క్లాస్ చూపిస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనే 55.25 సగటుతో 221 పరుగులు చేశాడు. ఇందులో రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 174.01 స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేస్తూ పాత రోహిత్ ను గుర్తు చేస్తున్నాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా 7,267 పరుగులతో రికార్డుల్లో ఉన్నాడు. కెప్టెన్‌గా ముంబైకి ఐదు టైటిల్స్ అందించిన ఘనత కూడా అతనికే సొంతం. 2007లో అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టిన రోహిత్, మూడు ఫార్మాట్లలో తిరుగులేని ప్లేయర్ గా ఎదిగాడు. ఓవరాల్ గా 508 మ్యాచ్‌ల్లో 20,109 పరుగులు సాధించాడు. ఇందులో 50 సెంచరీలు, 111 అర్ధసెంచరీలు ఉన్నాయి. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలను కెప్టెన్ గా, ప్లేయర్ గా గెలిచిన అరుదైన రికార్డు రోహిత్ ఖాతాలో ఉంది. టీ20 ఇంటర్నేషనల్స్ లో 4,231 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచిన రోహిత్, 2024 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఆ ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం రోహిత్ ఫోకస్ అంతా 2027లో సౌత్ ఆఫ్రికా, జింబాబ్వే వేదికలుగా జరగబోయే వన్డే వరల్డ్ కప్ మీద ఉంది. ఇందుకోసం అతను తన ఫిట్‌నెస్ ను భారీగా మెరుగుపరుచుకున్నాడు. వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు బాదిన ఏకైక ఆటగాడు రోహిత్. 264 పరుగుల అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. టెస్టుల్లో కూడా 40కి పైగా సగటుతో 4,301 పరుగులు చేసి తన సత్తా చాటుకున్నాడు. రోహిత్ కేవలం బ్యాటింగ్ తోనే కాదు, మైదానంలో తన హావభావాలు, స్టంప్ మైక్ లో రికార్డ్ అయ్యే సరదా మాటలతో ఎప్పుడూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ ఉంటాడు. అతని కామెడీ టైమింగ్, సెటైర్లు నెటిజన్లకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తాయి. బహుశా ఇదే క్వాలిటీ అతన్ని ఇప్పుడు టీవీ షో వైపు నడిపించి ఉండొచ్చు. క్రికెట్ పిచ్ పై ప్రత్యర్థులను వణికించే హిట్‌మ్యాన్, ఇప్పుడు బుల్లితెరపై ప్రేక్షకులను ఎలా మెప్పిస్తాడో చూడాలని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సీఎస్కే నుంచి వైదొలగిన ధోనీ!



ప్రస్తుత ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ధోనీ అసలు కనిపించడం లేదు. అదిగో వస్తున్నాడు..ఇదిగో వస్తున్నాడని చెప్పి..ఇప్పుడు లీగ్ చివరి దశకు చేరుకుంది. అయితే ధోనీ రాకపై ఇప్పుడు అతని ఫ్యాన్స్‌కు షాకింగ్ వార్త తెలుస్తోంది. ఎంఎస్ ధోనీ ఇకపై ఆటగాడిగా కొనసాగడం కష్టంగా పరిస్థితి కనిపిస్తోంది. కానీ, ధోనీ రిటైర్మెంట్‌పై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైఖెల్ క్లార్క్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. సీఎస్కే నుండి రిటైర్ అయిన తర్వాత ధోనీకి క్రికెట్‌తో ఎలాంటి సంబంధం లేదని మైఖేల్ క్లార్క్ సంచలన ప్రకటన చేశారు. సీఎస్కే జట్టుకు ప్రతీక అయిన ధోనీ 2026 ఐపీఎల్ సిరీస్‌తో రిటైర్ అయినట్టే అని.. సీఎస్కే జట్టులో అతనికి కీలక పాత్ర ఇస్తానని చెబుతున్న తరుణంలో, రిటైర్మెంట్ తర్వాత తన ఆటతో ఎలాంటి సంబంధం ఉండదని ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు మైఖేల్ క్లార్క్ సంచలన వ్యాఖ్యలు చేశాడు.చెన్నై సూపర్ కింగ్స్ జట్టు అనగానే మనకు గుర్తొచ్చే ముందుగా ధోనీదే. అయితే, అతను ఈ ఏడాది ఐపీఎల్‌తో రిటైర్ అవుతాడని అంటున్నారు. ఈ సీజన్ ప్రారంభంలో ధోనీ ఆడతాడని భావించినా.. గాయం కారణంగా 2026 ఐపీఎల్ ప్రారంభం నుంచే ఆటకు దూరమయ్యాడు. ఈ విషయం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. గత ఐపీఎల్ సీజన్‌లోనే నడుము నొప్పితో బాధపడిన అతను, ఈ సీజన్‌లో కూడా దానితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ కారణంగా, అతను ఇంకా చెన్నై తుదిజట్టులో అవకాశం ఉండడం లేదు.ఎంఎస్ ధోనీ నెట్స్‌లో ప్రాక్టీస్ కొనసాగిస్తూ బ్యాటింగ్‌లో రాణిస్తున్నాడని సీఎస్‌కే జట్టు కోచ్‌లు చెబుతున్నారు. అయితే, అతను పరుగెత్తి పరుగులు చేయలేకపోతున్నాడని అంటున్నారు. ఈ కారణంగా, అతనికి ఇంకా జట్టులో చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు మైఖేల్ క్లార్క్ ధోనీ గురించి కొన్ని విషయాలు పంచుకున్నారు. ఇటీవలే ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న మైఖేల్ క్లార్క్ ఈ విధంగా స్పందించాడు. “ధోనీ కంటే గొప్ప వికెట్ కీపర్ మరొకరు ఉన్నారని నన్ను ఎవరూ ఒప్పించలేరు. ధోనీ నేటికీ టీ20 క్రికెట్‌లో అత్యుత్తమ వికెట్ కీపర్‌లలో ఒకడు. అతను సాధారణ ఆటగాడు కాదు, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న క్రికెట్ దిగ్గజం. కాబట్టి, అతను రిటైర్ అవ్వాలని చెప్పేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి” అని అన్నాడు. ధోనీ రిటైర్ అయ్యాక, అతను క్రికెట్ ప్రపంచంలో కనిపించకోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అదే విధంగా ధోనీ కామెంటరీ చేసే అవకాశం కూడా తక్కువగానే ఉంది. కానీ, అతను చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు రాబోయే కాలంలో మెంటార్‌గా పనిచేసినా ఆశ్చర్యం అక్కర్లేదు. అతను పూర్తిస్థాయి కోచ్‌గా వ్యవహరించడం కూడా సాధ్యం కాదు. కాబట్టి అభిమానులు ఉత్సాహం పరచడం సహా జట్టును దగ్గరుండి ప్రోత్సహించేందుకు ధోనీ అవసరం ఉండొచ్చు.

# వినేశ్ ఫొగాట్‌కు డబ్ల్యూఎఫ్ఐ షోకాజ్ నోటీసులు



స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆమె క్రమశిక్షణారాహిత్యానికి, డోపింగ్ నిరోధక నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఆరోపించింది. రిటైర్ అయిన అథ్లెట్లు, తిరిగి పోటీల్లో పాల్గొనాలంటే, యూడబ్ల్యూడబ్ల్యూ డోపింగ్ నిరోధక నిబంధనల ప్రకారం, ముందస్తుగా 6 నెలల నోటీసును తప్పనిసరిగా ఇవ్వాలి. కానీ వినేశ్ దీనిని పాటించలేదని, అందుకే ఆమెను 2026 జూన్ 26 వరకు దేశీయ ఈవెంట్లలో పోటీ చేయడానికి అనర్హురాలిగా ప్రకటిస్తున్నట్లు సమాఖ్య పేర్కొంది. డబ్ల్యూఎఫ్ఐ తన 15 పేజీల నోటీసులో, వినేశ్ ప్రవర్తన దేశానికి అవమానం కలిగించిదని, భారత రెజ్లింగ్ ప్రతిష్టను దెబ్బతీసిందని పేర్కొంది. డబ్ల్యూఎఫ్ఐ రాజ్యాంగం, యూడబ్ల్యూడబ్ల్యూ అంతర్జాతీయ రెజ్లింగ్ నిబంధనలు, డోపింగ్ నిరోధక నిబంధనలను ఉల్లంఘించిందని ఆరోపించింది. వినేశ్‌పై ప్రధానంగా 4 ఆరోపణలు చేసిన భారత రెజ్లింగ్ సమాఖ్య, వాటికి ఆమె వివరణ ఇవ్వాలని కోరింది. అవి ఏమిటంటే 2024 పారిస్ ఒలింపిక్స్‌లో బరువు పెరగడం వల్ల అనర్హతకు గురవ్వడం, డోపింగ్ నిరోధక నిబంధనల ప్రకారం, అథ్లెట్ ఎక్కడ ఉన్నారో తెలపాలి (వేర్ ఎబౌట్స్). కానీ ఆమె ఆ విషయాన్ని ఎందుకు చెప్పలేదు. 2024 మార్చిలో ఐఓఏ నియమించిన అడ్-హాక్ ప్యానెల్ నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో ఆమె రెండు వేర్వేరు బరువు విభాగాల్లో పోటీ చేయడం. ఇంకా క్రమశిక్షణ రాహిత్యానికి సంబంధించిన ఆరోపణలపై వినేశ్ వివరణ ఇవ్వాలని భారత రెజ్లింగ్ సమాఖ్య తేల్చిచెప్పింది. మరోవైపు మే 10 నుంచి మే 12 వరకు గోండాలో జరగనున్న నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌తో సహా ఏ దేశీయ ఈవెంట్‌లోనూ వినేశ్ ఫొగాట్ పాల్గొనడానికి అర్హురాలు కాదని భారత రెజ్లింగ్ సమాఖ్య స్పష్టం చేసింది. ఈ ఏడాది జూన్ 26 వరకు ఇది వర్తిస్తుందని పేర్కొంది. వాస్తవానికి ఈ టోర్నమెంట్‌ను తన పునరాగమనం (కమ్-బ్యాక్) ఈవెంట్‌గా వాడుకోవాలని వినేశ్ ఫొగాట్ భావించారు. కానీ తాజా నిషేధంతో ఆమె అందులో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయారు.”ఇకపై ఏ రెజ్లింగ్ పోటీల్లోనైనా ఫెడరేషన్‌కు ప్రాతినిధ్యం వహించాలంటే, వినేశ్ ఫొగాట్ ఎలాంటి డోపింగ్ నిరోధక నియమాలను ఉల్లంఘించలేదని ఫెడరేషన్ సంతృప్తి చెందాలి” అని డబ్ల్యూఎఫ్ఐ తన నోటీసులో పేర్కొంది. అయితే ఈ నోటీసుపై స్పందించడానికి ఆమెకు 14 రోజుల సమయం ఇచ్చారు. పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫైనల్ మ్యాచ్‌లో అధిక బరువు కారణంగా వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడింది. దీనితో ఆమె 2024లో రిటైర్‌మెంట్ ప్రకటించారు. అయితే తర్వాత మనస్సు మార్చుకున్న ఆమె, గోండాలో ప్రారంభమయ్యే నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ ఈవెంట్‌లో పాల్గొనాలని నిర్ణయించుకున్నారు. అయితే తాను గోండా ఈవెంట్‌లో పాల్గొనకుండా డబ్ల్యూఎఫ్ఐ అడ్డుకుంటోందని వినేశ్ ఇంతకు ముందే ఆరోపించారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ భారత రెజ్లింగ్ సమాఖ్య చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఫిర్యాదు చేసిన ఆరుగురిలో తాను కూడా ఉండడమే ఇందుకు కారణమని ఆమె పేర్కొన్నారు. అయితే, వాడా (డబ్ల్యూఏడీఏ) నిబంధనలు పాటించడం విషయంలో రాజీ పడలేమని, వినేశ్ తన అర్హతను కచ్చితంగా నిరూపించుకోవాల్సి ఉంటుందని భారత రెజ్లింగ్ సమాఖ్య స్పష్టం చేసింది. “వాడా నిబంధనలను వినేశ్ సరిగ్గా పాటించారో, లేదో మనం చూడాలి. రిటైర్‌మెంట్ తర్వాత తిరిగి క్రీడల్లోకి రావడానికి అవసరమైన అర్హతలను ఆమె సాధించినట్లు ఇంకా రుజువు కాలేదు. మళ్లీ పోటీ చేయడానికి అర్హత సాధించాలంటే, ఆమె తప్పనిసరిగా 6 నెలల నోటీసు వ్యవధిని పూర్తి చేయాలి” అని డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్ పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్స్ నాటి సమస్యలను లేవనెత్తి, వాటి ఆధారంగా షోకాజ్ నోటీసులు ఎందుకు జారీ చేశారని విలేకరులు ప్రశ్నించగా, “ఆ సమయంలో డబ్ల్యూఎఫ్ఐ సైడ్‌లైన్స్‌లో ఉంది. తాత్కాలిక కమిటీయే వ్యవహారాన్నీ నడుపుతోంది. అంతేకాక, ఆమె పారిస్ గేమ్స్ తరువాత రిటైర్ అయ్యారు. కనుక ప్రశ్నలు అడగడానికి సమయం లేకుండా పోయింది. మళ్లీ ఇప్పుడు ఆమె తిరిగి రావాలని అనుకుంటున్నారు కాబట్టి సమాఖ్య అడిగిన వాటికి వివరణ ఇచ్చితీరాలి” అని సంజయ్ సింగ్ స్పష్టం చేశారు.

# క్రీడా మంత్రిగా మాజీ క్రికెటర్!

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మాజీ టీమిండియా పేసర్ అశోక్ దిండా నూతన క్రీడా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో, క్రీడా రంగంలో విశేష అనుభవమున్న దిండాకు ఈ పదవి దక్కింది.

బీజేపీ మొత్తం 294 స్థానాలకు గాను 206 సీట్లను గెలుచుకుని అధికారాన్ని చేజిక్కించుకుంది. ఈ విజయ పరంపరలో దిండా మొయినా నియోజకవర్గం నుంచి వరుసగా రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2021లో తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆయన, ప్రతిపక్ష హోదా నుంచి ఇప్పుడు నేరుగా కేబినెట్ మంత్రిగా పదోన్నతి పొందారు. మంత్రి పదవి కోసం ఎమ్మెల్యే సౌరవ్ సిక్దర్, మాజీ హాకీ స్టార్ భరత్ ఛెత్రి వంటి వారి నుంచి అశోక్ దిండాకు తీవ్ర పోటీ ఎదురైంది.

క్రీడా రంగంలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవం, క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన బెంగాల్ క్రీడలకు మేలు చేస్తాయని భావించిన అధిష్టానం, దిండా వైపే మొగ్గు చూపింది.బెంగాల్ క్రీడా శాఖ బాధ్యతలు వరుసగా ఇద్దరు క్రికెటర్లకే దక్కడం విశేషం. గత తృణమూల్ ప్రభుత్వంలో మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ క్రీడా మంత్రిగా ఉండగా, ఇప్పుడు అశోక్ దిండా ఆ బాధ్యతలను స్వీకరించారు. అశోక్ దిండా క్రికెట్ కెరీర్‌కు క్రీడాభిమానుల్లో గొప్ప గౌరవం ఉంది. 2008లో ఐపీఎల్ ద్వారా వెలుగులోకి వచ్చి, తనదైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు.భారత్ తరపున 13 వన్డేలు, 9 టీ20లు ఆడిన ఆయన, డొమెస్టిక్ క్రికెట్‌లో బెంగాల్ జట్టుకు వెన్నెముకగా నిలిచారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఏకంగా 420 వికెట్లు పడగొట్టి తన సత్తా చాటారు. 2021లో క్రికెట్‌కు స్వస్తి చెప్పిన దిండా, ఇప్పుడు రాజకీయ మైదానంలో క్రీడా మంత్రిగా తన రెండో ఇన్నింగ్స్‌ను ఘనంగా ప్రారంభించారు.

# అక్షర్ పటేల్ బ్యాటింగ్ వైఫల్యం..

ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ముఖ్యంగా ఆ జట్టు సారథి అక్షర్ పటేల్ బ్యాటింగ్ ఫామ్ టీమ్ మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. శుక్రవారం అరుణ్ జైట్లీ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్ అక్షర్ కు ఒక పీడకలలా మిగిలిపోయింది. ఈ సీజన్ లో అతను బ్యాట్ తో అస్సలు ప్రభావం చూపలేకపోతున్నాడు. తాజా మ్యాచ్ లో విఫలం అవ్వడం ద్వారా ఐపీఎల్ చరిత్రలోనే ఒక చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. ఒక ఐపీఎల్ సీజన్ లో కనీసం 7 ఇన్నింగ్స్ లు ఆడిన కెప్టెన్లను పరిగణనలోకి తీసుకుంటే, అక్షర్ పటేల్ యావరేజ్ (6.28) రెండో స్థానంలో ఉంది. ఈ లిస్ట్ లో అగ్రస్థానంలో రాజస్థాన్ రాయల్స్ మాజీ కెప్టెన్ షేన్ వార్న్ (2.00 యావరేజ్, 2010 సీజన్) ఉన్నాడు. అక్షర్ తర్వాత ఇయాన్ మోర్గాన్ (11.08), హర్భజన్ సింగ్ (12.00), రవిచంద్రన్ అశ్విన్ (12.75) వంటి వారు ఉన్నారు. భారీ హిట్టింగ్ తో మ్యాచ్ లు గెలిపించాల్సిన కెప్టెన్ ఇలా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం అవ్వడం ఢిల్లీకి పెద్ద మైనస్ పాయింట్ అయింది. ప్రస్తుత ఐపీఎల్ లో బ్యాటర్లు 200 పైచిలుకు స్ట్రైక్ రేట్ తో విరుచుకుపడుతుంటే, అక్షర్ పటేల్ మాత్రం టెస్ట్ మ్యాచ్ ఇన్నింగ్స్ తరహాలో ఆడుతున్నాడు. ఈ సీజన్ లో కనీసం 50 బంతులు ఎదుర్కొన్న ఆటగాళ్లలో అక్షర్ స్ట్రైక్ రేట్ (74.57) అందరికంటే తక్కువ. టీ20 ఫార్మాట్ లో ఇలాంటి బ్యాటింగ్ టీమ్ విజయవకాశాలను దెబ్బతీస్తోంది. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో పరుగులు రాబట్టడంలో అతను పూర్తిగా తడబడుతున్నాడు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో కేకేఆర్ స్పిన్నర్లు సునీల్ నరైన్, అనుకుల్ రాయ్, వరుణ్ చక్రవర్తి ఆతిథ్య జట్టును ఊపిరి తీసుకోనివ్వలేదు. ఓపెనర్లు పాతుమ్ నిసాంక (50), కేఎల్ రాహుల్ (23) మంచి ఆరంభాన్ని ఇచ్చినా, ఆ తర్వాత వచ్చిన మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు కేకేఆర్ స్పిన్ ఉచ్చులో చిక్కుకున్నారు. సునీల్ నరైన్ ప్రమాదకరమైన సమీర్ రిజ్వీని అవుట్ చేయగా, అనుకుల్ రాయ్ ఒకే ఓవర్లో నిశ్శంక, ట్రిస్టన్ స్టబ్స్ లను పెవిలియన్ పంపి ఢిల్లీ వెన్ను విరిచాడు.ఒకానొక దశలో ఢిల్లీ కనీసం 100 పరుగులు కూడా చేయలేని స్థితిలో ఉంది. ఆ సమయంలో యంగ్ ప్లేయర్ అశుతోష్ శర్మ 28 బంతుల్లో 39 పరుగులు చేసి స్కోరును 142కు చేర్చాడు. అతని పోరాటం లేకపోతే ఢిల్లీ పరువు దక్కేది కాదు. అక్షర్ పటేల్ ఫామ్ పై ఢిల్లీ కోచ్ హేమాంగ్ బదానీ స్పందిస్తూ.. ప్రదర్శన చేయాలి లేదా తప్పుకోవాలి’ అనే స్థితిలో జట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ తన తర్వాతి మ్యాచ్ లలో పుంజుకోవాలంటే కెప్టెన్ అక్షర్ పటేల్ బ్యాట్ ఝుళిపించడం చాలా ముఖ్యం.



# యశస్వి జైస్వాల్‌పై రెండేళ్ల నిషేధం




టీమిండియా భవిష్యత్తు స్టార్లుగా వెలుగొందుతున్న యశస్వి జైస్వాల్, షఫాలీ వర్మలు ఇప్పుడు అనూహ్యమైన చిక్కుల్లో పడ్డారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ వీరిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయడం క్రీడా వర్గాల్లో పెను సంచలనంగా మారింది. డోపింగ్ పరీక్షల కోసం తమ ఆచూకీ (వేర్ అబౌట్స్)- తెలపడంలో విఫలమవ్వడం, అలాగే అధికారులు పరీక్షల కోసం వెళ్లినప్పుడు అందుబాటులో లేకపోవడంతో నాడా ఈ చర్యలు తీసుకుంది. ప్రస్తుతం యశస్వి జైస్వాల్ ఐపీఎల్‌లో బిజీగా ఉండగా.. షఫాలీ వర్మ ప్రపంచకప్ విజయానంతరం విరామంలో ఉంది. అంతర్జాతీయ క్రీడా నిబంధనల ప్రకారం.. ‘రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్’లో ఉన్న ప్రతి అథ్లెట్ తమ రోజువారీ షెడ్యూల్‌ను నాడా యాప్‌లో అప్‌డేట్ చేయాలి. దీనిని ‘వేర్ అబౌట్స్’ అంటారు. అంటే అధికారులు నోటీసు ఇవ్వకుండా ఏ సమయంలోనైనా వచ్చి డోపింగ్ శాంపిల్స్ సేకరించే అధికారం కలిగి ఉంటారు. యశస్వి జైస్వాల్, షఫాలీ వర్మలు తాము రిజిస్టర్ చేసిన ప్రదేశాల్లో అధికారులు తనిఖీకి వెళ్లినప్పుడు అక్కడ లేకపోవడంతో దీనిని నిబంధనల ఉల్లంఘనగా నాడా పరిగణించింది. క్రీడాకారులకు ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. ‘వేర్ అబౌట్స్ ఫెయిల్యూర్’ చట్టం ప్రకారం.. 12 నెలల వ్యవధిలో మూడుసార్లు ఇలా పరీక్షలకు గైర్హాజరైతే.. అది డోపింగ్ టెస్టులో ఫెయిల్ అయిన దానితో సమానంగా పరిగణించబడుతుంది. ఒకవేళ వీరు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోతే.. విచారణ అనంతరం వీరిద్దరిపై గరిష్టంగా రెండేళ్ల వరకు నిషేధం విధించే అవకాశం ఉంది. అదే జరిగితే వీరి కెరీర్ తీవ్రమైన సంక్షోభంలో పడే ప్రమాదం ఉంది.ఈ నోటీసులు కేవలం ఆ ఇద్దరు ఆటగాళ్లకే కాదు, మొత్తం భారత క్రికెట్‌కే పెద్ద ఆందోళనగా మారాయి. యశస్వి జైస్వాల్ రాజస్థాన్ రాయల్స్ జట్టులో కీలక ఆటగాడు మాత్రమే కాదు.. టీమిండియా ఓపెనింగ్ విభాగంలో విశ్వసనీయమైన ప్లేయర్. అలాగే షఫాలీ వర్మ మహిళా క్రికెట్‌లో విధ్వంసకర బ్యాటర్. వీరిద్దరూ లేకపోవడం అంటే జట్టు బలహీనపడటమే. ముఖ్యంగా ఐపీఎల్ కీలక దశలో ఉండగా యశస్వి జైస్వాల్‌కు ఇటువంటి నోటీసులు రావడం రాజస్థాన్ యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది. ప్రస్తుతానికి నాడా వీరికి వివరణ ఇచ్చుకోవడానికి కొంత సమయం ఇచ్చింది. తమ ప్రయాణాలు లేదా అత్యవసర కారణాల వల్ల పరీక్షలకు అందుబాటులో లేమని నిరూపించుకోగలిగితే వీరు ఊపిరి పీల్చుకోవచ్చు. లేని పక్షంలో డోపింగ్ విచారణ కమిటీ ముందు హాజరుకావాల్సి ఉంటుంది. బీసీసీఐ ఈ విషయంలో క్రీడాకారులకు ఎలా మద్దతుగా నిలుస్తుంది, ఈ యువ ఆటగాళ్లు తమ కెరీర్‌ను ఎలా కాపాడుకుంటారు అనేది ఇప్పుడు క్రికెట్ అభిమానులందరిలో ఉత్కంఠ నెలకొంది.

# 'కరుప్పు' చిత్రానికి యూకే సెన్సార్ బోర్డు గ్రీన్ సిగ్నల్

తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'కరుప్పు' విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రానికి బ్రిటన్ సెన్సార్ బోర్డు ఎలాంటి కట్స్ లేకుండా 'అన్ కట్ 15' సర్టిఫికేట్ జారీ చేసింది. మే 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రానికి, ఇప్పటికే భారత సెన్సార్ బోర్డు 'U/A' సర్టిఫికేట్ ఇచ్చిన విషయం తెలిసిందే. యూకే, యూరప్‌లో ఈ సినిమాను పంపిణీ చేస్తున్న అహింస ఎంటర్‌టైన్‌మెంట్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది."యూకే సెన్సార్ బోర్డు 'కరుప్పు' చిత్రాన్ని వీక్షించి, కట్స్ లేకుండా '15' రేటింగ్ ఇచ్చింది. మే 14న థియేటర్లలో భారీ పండగ వాతావరణం ఖాయం" అని నిర్మాణ సంస్థ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. దర్శకుడు ఆర్జే బాలాజీ అద్భుతంగా సినిమాను తీశారని ప్రశంసించింది. గతేడాది సూర్య పుట్టినరోజున విడుదలైన 'కరుప్పు' టీజర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది.

ఈ చిత్రంలో సూర్య 'శరవణన్' అనే లాయర్ పాత్రలో, అలాగే 'కరుప్పు' అనే మరో పేరుతో కనిపిస్తారని టీజర్ ద్వారా స్పష్టమైంది. పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు, పంచ్ డైలాగులతో ఇది పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా, యోగి బాబు, నాటి, మలయాళ నటులు ఇంద్రాన్స్, శివాడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. యువ సంగీత సంచలనం సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, 'బిగిల్', 'జవాన్' వంటి భారీ చిత్రాలకు పనిచేసిన జీకే విష్ణు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం మే 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# మనం చేసే పని మన మనసు చెప్పిన దారిలోనే ఉండాలి

## : శోభిత ధూళిపాళ

సినీ నటి, హీరో అక్కినేని నాగచైతన్య భార్య శోభిత ధూళిపాళ తన కెరీర్‌తోనే కాకుండా, తన వ్యక్తిత్వంతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. నాగచైతన్యతో వివాహం తర్వాత వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదిస్తూనే, వృత్తి పరంగా కూడా ఆమె బిజీగా ఉంటున్నారు. దుబాయ్‌కు చెందిన ప్రముఖ తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్ శ్రీలత అడెపల్లి, ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న తెలుగు మహిళలను అభినందిస్తూ ఒక ప్రత్యేక వీడియోను రూపొందించారు. ఈ జాబితాలో శోభిత పేరును కూడా ప్రస్తావించడం విశేషం. ప్రపంచ వేదికలపై తెలుగు వారి ప్రతిభను చాటుతున్న మహిళలందరినీ ఒకే చోట చేర్చి గౌరవించడం అందరినీ ఆకట్టుకుంది.

శ్రీలత పోస్ట్‌పై శోభిత స్పందిస్తూ తన జీవిత సూత్రాన్ని పంచుకున్నారు. జీవితంలో మనం చేసే ప్రతి పని మన మనసు చెప్పిన దారిలోనే ఉండాలని... అప్పుడే ఆ క్షణాలు అర్థవంతంగా ఉంటాయని చెప్పారు. ఇతరుల కోసం కాకుండా, మనకు మనం నిజాయతీగా ఉండటం, మనల్ని మనం గౌరవించుకోవడం అత్యంత ముఖ్యమని అన్నారు. ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం ద్వారానే సమాజంలో మహిళలు మరింత ఎత్తుకు ఎదుగుతారని తెలిపారు.

# అది వ్యక్తి విజయం కాదు.. ప్రజా విశ్వాసం

## : విజయ్‌కు మద్దతుగా మంచు మనోజ్‌పోస్ట్

తమిళనాడు రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంది. వామపక్ష పార్టీలు, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) మద్దతు ప్రకటించడంతో టీవీకే కూటమి మ్యాజిక్ ఫిగర్‌ను అందుకుంది. ఈ నేపథ్యంలో విజయ్ త్వరలోనే గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటును కోరనున్నారని తెలుస్తోంది.ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేశారు. విజయ్ విజయంపై తన ఆనందాన్ని, అభిప్రాయాలను పంచుకుంటూ మనోజ్ చేసిన వ్యాఖ్యలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. "తమిళనాడులో ప్రజల తీర్పే అత్యున్నత శక్తి. మార్పు కోసం ప్రజలు ఏకం అయితే చరిత్ర కూడా మారిపోతుంది" అని పేర్కొన్నారు. ఎన్నో విమర్శలు, ట్రోల్స్, అడ్డంకులు ఎదురైనా తన తొలి ఎన్నికల్లోనే విజయ్ సత్తా చాటారని కొనియాడారు."దళపతి విజయ్ అనే పేరు ఇప్పుడు సామాన్య ప్రజల్లో ఆశకు ప్రతీకగా మారింది. ప్రజలను గుండెల్లో పెట్టుకునే నాయకులను తమిళనాడు ఎప్పుడూ ఆదరిస్తుంది" అని మనోజ్ పేర్కొన్నారు. ఇది కేవలం రాజకీయ విజయం కాదని, మార్పు కోసం ఎదురుచూస్తున్న ప్రజల భావోద్వేగానికి ప్రతిబింబమని వ్యాఖ్యానించారు. డీఎంకే, ఏఐఏడీఎంకే మళ్లీ ఒక్కటవుతాయన్న ప్రచారాన్ని ఆయన పుకార్లుగా కొట్టిపారేశారు. దశాబ్దాలుగా ప్రజా తీర్పును గౌరవిస్తున్న ఆ పార్టీలకు ప్రజాస్వామ్య విలువల గురించి బాగా తెలుసని అభిప్రాయపడ్డారు.



# జీక్యూ కవర్‌పేజీపై కృతి స్టన్నింగ్ లుక్

వెండితెరపై తన అద్భుత నటనతో కోట్లాదిమంది అభిమానుల మనసు గెలుచుకున్న నటి కృతి సనన్ ఇప్పుడు వ్యాపార రంగంలోనూ అప్రతిహతంగా దూసుకుపోతోంది. ఇటీవల ముంబైలో జరిగిన ప్రతిష్టాత్మక -ఫెమినా బ్యూటీ అవార్డ్స్ 2026- వేడుకలో -బ్యూటీ అంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్- పురస్కారాన్ని అందుకున్నారు. కేవలం గ్లామర్ ప్రపంచానికే పరిమితం కాకుండా.. ఒక పారిశ్రామికవేత్తగా కృతి సాధిస్తున్న విజయాలు సినిమా రంగానికి ఆవల తనకు ఉన్న బలమైన పనితనాన్ని నిరూపిస్తున్నాయి. స్కిన్ కేర్ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ కృతి ప్రారంభించిన వ్యాపార ప్రయాణం ఇప్పుడు ఒక మైలురాయిని చేరుకుంది.

కృతి సనన్ స్థాపించిన స్కిన్ కేర్ బ్రాండ్ -హైఫన్- అనతి కాలంలోనే సౌందర్య సాధనాల పరిశ్రమలో బలమైన ముద్ర వేసింది. సాధారణంగా సెలబ్రిటీలు బ్రాండ్ అంబాసిడర్లుగా మాత్రమే వ్యవహరిస్తుంటారు.. కానీ కృతి మాత్రం అందుకు భిన్నంగా ఉత్పత్తుల అభివృద్ధి.. బ్రాండ్ విజన్ .. క్వాలిటీ కంట్రోల్ వంటి విషయాల్లో స్వయంగా పాల్గొంటున్నారు. శరీరతత్వాన్ని బట్టి హై-పెర్ఫార్మింగ్ సన్‌స్క్రీన్‌లు, బారియర్ రిపేర్ క్రీమ్‌లు - గ్లో బూస్టింగ్ సీరమ్స్ వంటి వినూత్న ఉత్పత్తులను పరిచయం చేస్తూ వినియోగదారుల నమ్మకాన్ని గెలుచుకున్నారు.




తన వ్యాపారాన్ని సామాన్యులకు చేరువ చేయడంలో కృతి అనుసరిస్తున్న వ్యూహాలు అద్భుతమనే చెప్పాలి. ఈ రంగంలో ఇప్పటికే పోటీపడుతున్న దీపిక పదుకొనే, కత్రిన లాంటి సీనియర్లకు భిన్నంగా కృతి తన బ్రాండ్ ని సక్సెస్ చేయడంలో సఫలమైంది. సామాన్యుల చర్మ సమస్యలను అర్థం చేసుకుంటూ.. అందరికీ అందుబాటులో ఉండే ధరలలో నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో విజయవంతమైంది. ఈ పారదర్శకతే తనను ఒక సక్సెస్ ఫుల్ అంట్రప్రెన్యూర్‌గా నిలబెట్టింది.వ్యాపారవేత్తగా బిజీగా ఉన్నా.. కృతి తన గ్లామర్ ప్రపంచాన్ని ఏమాత్రం విస్మరించడం లేదు. తాజాగా ప్రఖ్యాత -జీక్యూ- మ్యాగజైన్ కవర్ పేజీపై అదిరిపోయే డిజైనర్ లుక్ తో మెరిసిపోయింది. కృతి రెడ్ టాప్- షార్ట్స్ ధరించి ఇచ్చిన పోజులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సమ్మర్ కి అనుగుణంగా ఉండే విభిన్నమైన డిజైనర్ దుస్తులను ధరించి ఫోజులిచ్చింది. ఈ బ్యూటీ ఆకర్షణీయమైన రూపంతో పాటు .. తను షేర్ చేస్తున్న వ్యక్తిగత విషయాలు కూడా నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. తాను మనసున్న -రొమాంటిక్- వ్యక్తినని, ప్రేమ - సంబంధాల విషయంలో నమ్మకానికి, నిబద్ధతకు, నిజాయితీకి తాను అత్యంత ప్రాధాన్యతనిస్తానని ఈ సందర్భంగా కృతి వెల్లడించారు.సినిమా రంగంలో అగ్ర హీరోయిన్‌గా రాణిస్తూనే.. వ్యాపార రంగంలో నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్న కృతి సనన్ ప్రయాణం బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనం. ఒకవైపు కళాత్మక రంగం.. మరోవైపు సాంకేతికతతో కూడిన స్కిన్ కేర్ బిజినెస్.. రెండింటినీ సమతుల్యం చేస్తూ ఈ బ్యూటీ సాగిస్తున్న ప్రస్థానం నేటి యువతకు గొప్ప స్ఫూర్తినిస్తోంది. పట్టుదల.. స్పష్టమైన విజన్ ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని కృతి సనన్ నిరూపిస్తున్నారు. 2026లో కృతి అందుకున్న ఈ పురస్కారం కెరీర్‌లో మరొక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది. కాక్ టెయిల్ 2లో కృతి సనన్ నయా గ్లామర్‌లి 2026 జూన్ 19న విడుదల కాబోతున్న -కాక్ టెయిల్ 2- చిత్రంలో కృతి సనన్ అల్లీ అనే అత్యంత స్టైలిష్- బోల్డ్ పాత్రలో కనిపిస్తోంది. ఈ సినిమా 2012 నాటి ఒరిజినల్ చిత్రానికి సీక్వెల్ కాకపోయినా అదే తరహా ఆధునిక స్నేహబంధాలు.. క్రిటికల్ ప్రేమ కథాంశంతో రూపొందుతోంది.




# ప్రేమకు లొంగిపోయిన 'రౌడీ జనార్ధన'..

## విజయ్ పుట్టినరోజున ఇంట్రెస్టింగ్ పోస్టర్



విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న కొత్త చిత్రం 'రౌడీ జనార్ధన' నుంచి చిత్రబృందం ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఈ స్టిల్ మరింత ఆసక్తిని పెంచింది.విడుదల చేసిన ఈ కొత్త పోస్టర్‌లో విజయ్ దేవరకొండ వర్షంలో తడుస్తూ, చేతిలో రివాల్వర్ పట్టుకుని ఉన్నారు. ఓ యువతి పాదాలను ఆయన తన ఛాతీపై ఉంచుకుని, రొమాంటిక్‌గా చూస్తూ కనిపించారు. చిత్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. "ప్రపంచంతో పోరాడే మనిషి... కానీ ప్రేమకు మాత్రమే లొంగిపోతాడు. మా రౌడీ జనార్ధన విజయ్ దేవరకొండకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అని క్యాప్షన్ జోడించింది.'రాజా వారు రాణి గారు' చిత్రంతో గుర్తింపు పొందిన రవికిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో విజయ్ సరసన కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తోంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో విజయ్ దేవరకొండ సరికొత్త గెటప్, డైలాగ్ డెలివరీతో మాస్ అవతారంలో కనిపించి అంచనాలు పెంచేశారు.

1980ల కాలంలో తూర్పు గోదావరి జిల్లా నేపథ్యంలో సాగే ఈ కథను తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో డిసెంబర్ లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.